JAYABHERIDAILY.COM

ప్రభాత **జయభేరి**

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 13-05-2026

Medchal - Malkajgiri | Wednesday 13-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 | సంచిక : 346

పేజీలు : 8 | వెల : 5

Vol. 02 | Issue 346 | Pages : 8 | ₹: 5

**విలేకర్లు కావలెను**

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com






# కష్టపడే వారికే పదవులు

ఇక ఎత్తండి గులాబీ జెండా.. ప్రజా సమస్యలే ఎజెండా.. నేతలంతా ఇక మీదట ప్రజాక్షేత్రంలోనే ఉండాలని ఆదేశించారు గులాబీ బాస్ కేసీఆర్. రైతులు, యువత సమస్యలపై దృష్టిసారించి ప్రత్యేక పోరాట కార్యచరణ రూపొందించాలన్నారు. వచ్చే రెండేళ్లు పార్టీకి కీలకమన్న మాజీ సీఎం ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని నేతలకు ఆదేశాలిచ్చారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ (కే చంద్రశేఖర్ రావు) ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో పార్టీ ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. భవిష్యత్ కార్యాచరణ, పార్టీ పటిష్ఠతపై కీలక సూచనలు చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఇన్‌చార్జ్‌ల నియామకంపై నేతలకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే రెండేళ్లు పార్టీకి కీలకమన్న కేసీఆర్.. ప్రజా సమస్యలే ఎజెండాగా ఉద్యమ కార్యాచరణ రూపొందించాలన్నారు. తెలంగాణలో ఒక్కో జిల్లాలో ఒక్కో సమస్య ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టాలని నేతలను సూచించారు. అన్నదాతల కష్టాలు, విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యలపై ఎంత గట్టిగా కొట్లాడితే పార్టీకి అంత ఎక్కువ ఆదరణ లభిస్తుందన్నారు కేసీఆర్.

## ఎత్తండి గులాబీ జెండా.. ప్రజా సమస్యలే ఎజెండా...

- వచ్చే రెండేళ్లు బీఆర్ఎస్‌కు చాలా కీలకం
- కేసీఆర్ కీలక వ్యాఖ్యలు

**జయభేరి, హైదరాబాద్ :**

వచ్చే రెండేళ్లు బీఆర్ఎస్ పార్టీకి అత్యంత కీలకమని పార్టీ చీఫ్ కే చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై పోరాటమే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్లాలని నేతలకు సూచించారు. పనిచేసే వారికే పార్టీ పదవులు ఇవ్వాలని స్పష్టం చేసిన కేసీఆర్.. రైతులు, యువత, విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పనిచేసే వారినే పార్టీ ఇంచార్జులుగా నియమించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. నియోజకవర్గాలు, జిల్లాల ఇంచార్జుల ఎంపిక విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తామన్నారు. పదేళ్లలో పార్టీ పదవులు పొందని వారికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. పార్టీ పదవుల్లో బంధువులు, తెలిసినవారికి కాకుండా పనిచేసే వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యువ సంఘాలు, విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాల్లో యాక్టివ్‌గా ఉన్నవారికి పదవులివ్వాలన్నారు కేసీఆర్. పార్టీ సభ్యత్వం విషయంలోనూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు కేసీఆర్. ఎంత ఎక్కువ మందికి సభ్యత్వం ఇచ్చామని కాదు.. పార్టీతో నిత్యం ...మిగతాది 2 లో

## విదేశీ మారక ద్రవ్యం నిల్వచేయడానికే..

# గతంలో ఇందిర.. ఇప్పుడు మోడీ

**హైదరాబాద్, మే 12 :**

ప్రధాని నరేంద్ర మోదీ ఏడాది పాటు బంగారం కొనవద్దని చేసిన విజ్ఞప్తిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రాజకీయ వర్గాల్లో దీనిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాహుల్ గాంధీ స్పందిస్తూ.. ప్రధాని ప్రతిసారీ బాధ్యతను ప్రజలపై నెట్టివేసి, జవాబుదారీతనం నుంచి తప్పించుకుంటున్నారని విమర్శించారు. అయితే, ఒక దేశ నాయకుడు ప్రజలను బంగారం కొనవద్దని కోరడం ఇదే మొదటిసారి కాదు. ఇందిరా గాంధీ నుంచి పి.చిదంబరం వరకు గతంలో ఇలాంటి విజ్ఞప్తులు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడానికి బంగారం కీలకంగా మారిన 4 సందర్భాలు ఇవే.

**1962: నగలని దానం చేసిన ఇందిరా గాంధీ**

1962 భారతచైనా యుద్ధ సమయంలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ రక్షణ నిధికి బంగారం, నగదు దానం చేయాలని కోరారు. సాయుధ దళాల సంక్షేమం కోసం ఈ ఫండ్‌ను ఏర్పాటు చేశారు.




## ధాన్యం కొనుగోళ్లను

# వేగవంతం చేయాలి



రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, మొక్కజొన్న కొనుగోళ్ల పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాను. మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని ఆదేశించాను. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశాను. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించాను. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ఆదేశించాను. అకాల వర్షా లతో ధాన్యం తడిచి పోయి, రైతులు ఇబ్బంది పడకుండా ఉండటం కోసం టార్పాలిన్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించాను. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించాను. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలను కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నాను. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించాను.

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి
- వరి కొనుగోళ్ల పై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం
- హమాలీ ఛార్జీలు పెంపు

**జయభేరి, హైదరాబాద్ :**

మిషన్ మోడ్‌లో పనిచేస్తూ రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ముఖ్యమంత్రి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోళ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు. “కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్లకు తరలించాలి. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించరాదు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు. ధాన్యం లోడింగ్ విషయంలో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలి. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలి. అలా చేయడం వల్ల తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు” అని చెప్పారు. లారీల కొరత ఉంటే దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని, ధాన్యం తరలించడానికి అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. “పలు ప్రాంతాల్లో గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని ...మిగతాది 2 లో




# ఏపీ విద్యార్థులకు అభినందనలు

- భవిష్యత్ సాంకేతిక రంగాల్లో యువతకు భారీ అవకాశాలు
- డీప్ టెక్ స్కిల్లింగ్‌తో అందుబాటులోకి ప్రపంచ స్థాయి టెక్నాలజీ
- నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్న సీఎం చంద్రబాబు

# భారత్ – ఒమన్ మధ్య..

- జూన్ 1 నుంచి అమల్లోకి! ప్రయోజనాలు ఏంటంటే?
- ఈ చర్య వల్ల ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణం గణనీయంగా పెరిగే అవకాశం



**జయభేరి, న్యూఢిల్లీ :**

భారత్ - ఒమన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. డిసెంబర్ 2025లో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగిన ...మిగతాది 2 లో



# కేసు కొట్టి వేయండి

- మధ్యంతర బెయిల్ ఇవ్వండి
- హైకోర్టులో బండి కుమారుడి పిటిషన్

**హైదరాబాద్, మే 13 :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన పోక్సో (POCSO) కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు ఆయన న్యాయపోరాటం మొదలుపెట్టారు. ఈ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భగీరథ్ సోమవారం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు వేసవి సెలవులు నడుస్తుండటంతో, భగీరథ్ తరపు న్యాయవాదులు అత్యవసరంగా వెకేషన్ బెంచ్ ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం, దీనిపై విచారణను మే 14 గురువారం కు వాయిదా వేసింది. ఆ రోజున వెకేషన్ బెంచ్ ఇచ్చే ఉత్తర్వులపై భగీరథ్ అరెస్టు ఉంటుందా లేదా అన్నది తేలనుంది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో 17 ఏళ్ల మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భగీరథ్‌పై మే 8న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. గత ఏడాది డిసెంబర్‌లో మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో ఈ ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## గతంలో ఇందిర.. ఇప్పుడు మోడీ

ఆ సమయంలో ఇందిరా గాంధీ స్వయంగా 367 గ్రాముల బంగారు ఆభరణాలను దానం చేశారు.

**1967: ఇందిరా గాంధీ విజ్ఞప్తి**

జూన్ 6, 1967న అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రజలను బంగారం కొనవద్దని కోరారు. ఆ సమయంలో భారత విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి ఉంది. 1965 పాకిస్థాన్ యుద్ధం తర్వాత దేశం కరువును ఎదుర్కొంటోంది. విదేశీ మారక నిల్వలు దాదాపు సున్నాకి పడిపోయాయి. అటువంటి క్లిష్ట సమయంలో ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి క్రమశిక్షణతో ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.

**1991: దేశాన్ని దివాళా తీయకుండా కాపాడిన బంగారం**

1991లో భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడింది. చమురు, ఎరువుల దిగుమతుల కోసం విదేశీ మారక నిల్వలు కేవలం 3 వారాలకు మాత్రమే సరిపోయేలా ఉన్నాయి. అప్పుడు భారత్ తన వద్ద ఉన్న 20 టన్నుల బంగారాన్ని విదేశీ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి 200 మిలియన్ డాలర్లను సేకరించింది. ఆ తర్వాత మరో 47 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు పంపింది. ఈ నిర్ణయమే దేశాన్ని దివాళా తీయకుండా కాపాడింది.

**2013: పి. చిదంబరం విజ్ఞప్తి**

యూపీఏ ప్రభుత్వ హయాంలో 2013లో అప్పటి ఆర్థిక మంత్రి పి. చిదంబరం కూడా ప్రజలను బంగారం కొనవద్దని కోరారు. "భారత ప్రజలు నా కోరిక ఒకటి నెరవేర్చాలంటే.. అది బంగారం కొనకపోవడమే" అని ఆయన పేర్కొన్నారు. అప్పట్లో కరెంట్ అకౌంట్ లోటు 6.7 శాతానికి చేరడంతో బంగారు దిగుమతులను తగ్గించడానికి ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 8 శాతానికి పెంచింది.

**మోదీ ఏమన్నారు?**

ప్రస్తుత పశ్చిమ ఆసియా సంక్షోభం నేపథ్యంలో విదేశీ మారక ద్రవ్యం అనవసరంగా బయటకు వెళ్లకుండా ఉండటానికి, ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లు ఆపాలని ప్రధాని మోదీ కోరారు. అలాగే ఇంధనాన్ని ఆదా చేయడం ద్వారా దేశ ఆర్థిక స్థితిని బలోపేతం చేయవచ్చని ఆయన సూచించారు.

## కష్టపడే వారికే పదవులు

ఉండేవారికి ఎంతమందికి ఇచ్చామన్నది ముఖ్యమన్నారు కేసీఆర్. క్రియాశీలకంగా పనిచేసేవారికే క్రియాశీల సభ్యత్వం ఇవ్వాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు కేసీఆర్. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కనెక్టివిటీ ఉండేలా పార్టీ చైన్ ఉండాలన్నారు కేసీఆర్. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పార్టీ నేతలకు అందుబాటులో ఉండాలన్నారు. పార్టీ వీక్‌గా ఉన్న నియోజకవర్గాలపై ఎక్కువ ఫోకస్ చేయాలన్నారు మాజీ సీఎం. త్వరలో జరగనున్న జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు, GHMC ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని నేతలకు కేసీఆర్ సూచించారు.

## వేగవంతం చేయాలి

బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. అవసరమైన చోట రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకుని ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలుండాలి" అని సూచించారు. ప్రాంతాల వారిగా సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారితనంతో వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. "అకాల వర్షాల సమయంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఇలాంటి సమయాల్లో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతీ ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలి. ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్ – ఒమన్ మధ్య..


విషయం తెలిసిందే. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే, రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలపడనున్నాయి. ఒమన్ ప్రతినిధి బృందంతో సమావేశమైన అనంతరం గోయల్ మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులను విస్తరించే మార్గాలపై చర్చలు జరిగాయని చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, తోలు వస్తువులు వంటి భారత ఎగుమతుల్లో దాదాపు 98 శాతం ఉత్పత్తులకు ఒమన్ మార్కెట్లో సుంకం రహిత ప్రవేశం లభించనుంది. దీంతో భారత ఎగుమతిదారులకు గల్ఫ్ ప్రాంతంలో కొత్త అవకాశాలు ఏర్పడతాయని భావిస్తున్నారు. అదే సమయంలో ఖర్జూరాలు, పాలరాయి, పెట్రోకెమికల్స్ వంటి ఒమన్ ఉత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించనుంది. ఈ చర్య వల్ల ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక చిలీతో జరుగుతున్న వాణిజ్య చర్చలపై కూడా గోయల్ స్పందించారు. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థల పరిమాణంలో వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, కీలక ఖనిజాల రంగంలో సహకారం పెరిగితే సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA) కుదిరే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భారత్, చిలీ ఇప్పటికే 2006లో ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందం (PTA) అమలు చేశాయి. ఇప్పుడు దానిని విస్తరించి డిజిటల్ సేవలు, పెట్టుబడులు, MSMEలు, కీలక ఖనిజాలు వంటి రంగాలను కలుపుతూ CEPAగా మార్చేందుకు చర్చలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా లిథియం, రాగి వంటి ఖనిజాల్లో చిలీ ప్రపంచంలో ప్రముఖ దేశంగా ఉండటంతో, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి రంగాలకు భారత్‌కు ఇది వ్యూహాత్మకంగా కీలకమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## కేసు కొట్టి వేయండి

వేధింపులు జరిగినట్లు బాధితురాలి కుటుంబం ఆరోపించింది. కాగా, ఈ కేసు నమోదు కావడానికి కొద్ది గంటల ముందే భగీరథ్ కరీంనగర్‌లో సదరు బాలిక కుటుంబంపై హనీట్రాప్, బ్లాక్ మెయిల్ ఆరోపణలతో ఎదురు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కేసు విచారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో విచారణ ముమ్మరంగా సాగుతోంది. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం అందుతున్న తరుణంలో, హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పోక్సో కేసులో నిబంధనలు అత్యంత కఠినంగా ఉండటంతో, హైకోర్టు మధ్యంతర ఉపశమనం కల్పిస్తుందా? లేదా? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసు విచారణకు సంబంధించి ఇప్పటికే పెట్ బషీరాబాద్ పోలీసులు ప్రాథమిక నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.




దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.. మనం దేశభక్తిని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.. అయితే అందుకోసం పెద్దపెద్ద త్యాగాలు చేయాల్సిన పని లేదు.. కానీ మన రోజువారీ పనుల్లో కొన్ని మార్పులు చేసుకుంటే సరిపోతుందని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బిజెపి బహిరంగ సభలో ప్రధాని మోదీ అన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా మళ్లీ కోవిడ్ కాలం నాటి పని సంస్కృతిని ప్రజలందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు.భారతదేశంలో బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు.. దీనిని సంప్రదాయానికి, సంపదకు, సామాజిక హోదాకు చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా వివాహాలు, దీపావళి, అక్షయ తృతీయ వంటి పండుగల సమయాల్లో బంగారం కొనుగోళ్లు గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. కొన్ని గణాంకాల ప్రకారం.. భారతీయులు ఏటా సగటున 700 నుండి 800 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలుపుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని వినియోగించే దేశాల్లో భారత్ ఒకటిగా నిలవడానికి ఇక్కడి ప్రజలకు ఈ పసిడిపై ఉన్న మక్కువనే ప్రధాన కారణం. అయితే ఇటీవల మోదీ బంగారం ఎక్కువగా కొనుగోలు చేయొద్దని ప్రకటన చేశారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందిదేశంలో బంగారానికి భారీ డిమాండ్ ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా మన దేశీయ ఉత్పత్తి అత్యంత స్వల్పంగా ఉంది. ఏటా కేవలం 1 నుండి 2 టన్నుల బంగారం మాత్రమే మన గనుల నుండి లభిస్తోంది. దీనివల్ల దాదాపు 90 శాతం కంటే ఎక్కువ డిమాండ్‌ను విదేశీ దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వస్తోంది. ముడిచమురు తర్వాత భారత్ అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నది బంగారం దిగుమతుల కోసమే. దీనివల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు పెరిగి, రూపాయి విలువపై, విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోంది.ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణలో పర్యటించినప్పుడు తెలిపారు. కనీసం ఏడాది పాటు కొత్త బంగారం కొనకుండా ఉండటం వల్ల దేశం నుంచి బయటకు వెళ్లే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని, ఆ నిధులను దేశాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పసిడిపై పెట్టుబడి పెట్టడం వల్ల అది వ్యక్తిగతంగా లాభదాయకంగా అనిపించినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పరంగా అది 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్' గానే మిగిలిపోతుందనేది నిపుణుల వాదన.బంగారం కొనుగోళ్లను తగ్గించడానికి ప్రభుత్వం 'సావరిన్ గోల్డ్ బాండ్' పథకాన్ని ప్రవేశపెట్టింది. భౌతికంగా బంగారాన్ని కొని లాకర్లలో దాచుకోవడం కంటే, బాండ్ల రూపంలో పెట్టుబడి పెట్టడం వల్ల విదేశీ దిగుమతుల భారం తగ్గుతుంది. దీనివల్ల వినియోగదారులకు భద్రతతో పాటు అదనపు వడ్డీ కూడా లభిస్తుంది. ప్రజలు తమ పెట్టుబడి దృక్పథాన్ని మార్చుకుని, భౌతిక బంగారం నుంచి డిజిటల్ , బాండ్ల వైపు మళ్ళినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది అని ఆర్థిక నిపుణులు అంటున్నరు.స్టాక్ మార్కెట్‌లో బ్లడ్ బాత్ చూడగానే అర్థమైంది అందరికి. మోదీ ఇచ్చింది స్టేట్‌మెంట్ కాదు అదొక వార్నింగ్ సిగ్నల్ అని. పొలిటికల్‌గా, ఒక పొలిటీషియన్‌గా నరేంద్ర మోదీ ఎంత అగ్రెసివ్‌గానైనా మాట్లాడొచ్చు. కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మ్యాటర్ అయితే మాత్రం.. ప్రతి అక్షరాన్ని, ప్రతి పొల్లును కొలతకొలిచినట్టు మరీ మాట్లాడతారు. అంతా సుభిక్షం, అంతా ప్రశాంతం అనాల్సిన మూమెంట్‌లో... 'జాగ్రత్తగా ఉండండి' అని అన్నారంటే, కచ్చితంగా 'దేశం క్లిష్ట పరిస్థితి'లో ఉందనే అర్థం. భయపెట్టాలని కాదు గానీ.. దేశ ప్రజలను ముందస్తుగా ప్రిపేర్ చేస్తున్నట్టు కనిపిస్తోంది ఆ మాటల్లో. సేవింగ్స్ మొత్తం ఖర్చైపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. మోదీ మాటలను డీకోడ్ చేస్తే వచ్చే అర్థం ఇదే. భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారు వినియోగదారు. ఏటా సగటున 700 నుండి 900 టన్నుల బంగారాన్ని మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. మనం దిగుమతి చేసుకునే ప్రతి గ్రాము బంగారానికి అమెరికన్ డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఏటా 3545 బిలియన్ డాలర్లు బంగారం దిగుమతులకే ఖర్చవుతాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ట్రాయ్ ఔన్సుకు 3,000 డాలర్లు దాటడంతో ఈ బిల్లు తడిసి మోపెడవుతోంది.ఒకవైపు పసిడి ధరలు భగ్గుమంటుంటే, మరోవైపు మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 126 డాలర్లకు చేరుకున్నాయి. దేశం నడవాలంటే చమురు తప్పనిసరి. మనం మన అవసరాల్లో 85శాతం దిగుమతి చేసుకుంటున్నాం. చమురుతో పోలిస్తే బంగారం కొనుగోలు అనేది ఒక ఆప్షన్ మాత్రమే..ముఖ్యంగా పెళ్లిళ్ల కోసం కొనే బంగారాన్ని వాయిదా వేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊరట లభిస్తుంది.దేశం యొక్క ఆర్థిక స్కోర్‌కార్డ్‌నే కరెంట్ ఖాతా అంటారు. మనం ఎగుమతుల ద్వారా సంపాదించే దానికంటే, దిగుమతుల కోసం ఖర్చు చేసేది ఎక్కువైతే లోటు ఏర్పడుతుంది. ఈ లోటు పెరిగితే రూపాయి విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా మారుతుంది.భారతదేశంలో ఏటా సుమారు 1012 మిలియన్ల వివాహాలు జరుగుతాయి. అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు ఉండే పెళ్లిళ్ల సీజన్‌లోనే దేశంలో అత్యధికంగా బంగారం అమ్ముడవుతుంది. "ఇది నిషేధం కాదు, కేవలం ఒక నైతిక విజ్ఞప్తి మాత్రమే. దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పౌరులు స్వచ్ఛందంగా తమ కొనుగోళ్లను వాయిదా వేసుకుంటే, అది దేశ విదేశీ మారక నిల్వలను కాపాడుతుంది" అని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు.క్లుప్తంగా చెప్పాలంటే, మళ్లీ లాక్‌డౌన్ పరిస్థితులు రాకుండా ఉండాలన్నా, రాబోయే ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నుండి సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, ప్రజల్లో క్రమశిక్షణ, పొదుపు అనే ముందస్తు జాగ్రత్తలను అలవాటు చేసేందుకుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది



## ఏపీ విద్యార్థులకు అభినందనలు

- **భవిష్యత్ సాంకేతిక రంగాల్లో యువతకు భారీ అవకాశాలు**
- **డీప్ టెక్ స్కిల్లింగ్‌తో అందుబాటులోకి ప్రపంచ స్థాయి టెక్నాలజీ**
- **నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్న సీఎం చంద్రబాబు**

**జయభేరి, అమరావతి :**

జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా భారత భవిష్యత్తును సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా నిర్మిస్తున్న శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇవాళ భారత శాస్త్రీయ విజయాలను స్మరించుకునే రోజు. పోఖ్రాన్ విజయాన్ని గుర్తు చేసుకునే రోజు. పోఖ్రాన్ విజయంతో మన దేశ సామర్థ్యాన్ని, శక్తిని, ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాం. నాలెడ్జ్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్ వంటి అంశాలతో స్థిరమైన అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని పోఖ్రాన్ విజయం నిత్యం గుర్తు చేస్తూనే ఉంటుంది. ఆ దిశగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు వేస్తోంది. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో బలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తూ, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణాన్ని పెంపొందించేందుకు రాష్ట్రం కట్టుబడి ఉంది. ఈ సందర్భంగా IBM SkillsBuild, APSCHE, APSSDC, అమరావతి క్వాంటమ్ వ్యాలీతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయి డీప్‌టెక్ స్కిల్లింగ్ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి రంగాలను కవర్ చేస్తూ 2026-27 నాటికి 2 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నాం. అలాగే వచ్చే ఐదేళ్లలో 10 లక్షల మందికి శిక్షణ ఇచ్చే లక్ష్యంతో శిక్షణ కార్యక్రమం రూపొందించాం. డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ, అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ల ద్వారా ఈ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. ఈ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేసేలా నాగార్జున యూనివర్శిటీలో NIELIT ఇన్నోవేషన్ & స్కిల్లింగ్ సెంటర్ కీలక పాత్ర పోషించనుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కమ్యూనికేషన్, సెమీకండక్టర్ టెక్నాలజీలపై ఈ కేంద్రం ప్రత్యేక దృష్టి సారించనుంది. ఈ విద్యా సంవత్సరంలోనే కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. దీని ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందుబాటులోకి వస్తుంది. దీంతో వేలాది మంది విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు లబ్ధి పొందనున్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా NPTEL జాతీయ పరీక్షల్లో 4 బంగారు పతకాలు, 14 రజత పతకాలు సాధించిన మన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను అభినందిస్తున్నా. మన రాష్ట్రంలోని ప్రతిభ, కృషి, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఎకోసిస్టమ్‌కు ఈ విజయాలే నిదర్శనం. క్వాంటమ్ వ్యాలీ విజన్ తో భవిష్యత్‌ను అందిపుచ్చుకునేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్న క్రమంలో మరింత మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ ప్లాట్‌ఫార్ములు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కోర్సులు, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని కోరుకుంటున్నాను.

## ముళ్ల కంచెలకు భయపడం



- **బెంగాల్ బోర్డర్‌లో ఫెన్సింగ్‌పై బంగ్లాదేశ్ సంచలన వ్యాఖ్యలు**
- **సరిహద్దుల్లో కంచె నిర్మాణంపై బెంగాల్ ఎన్నికల్లో హామీ**
- **తొలి క్యాబినెట్ సమావేశంలోనే ప్రభుత్వం నిర్ణయం**
- **అవసరమైతే భారత్‌తో చర్చలు జరుపుతామన్న బంగ్లాదేశ్**

**జయభేరి, బెంగాల్ :**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం ప్రచార అస్త్రాల్లో ఒకటిగా నిలిచింది. దీనిపై టీఎంసీ, బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. చివరకు బీజేపీ అధికారంలోకి రావడంతో అక్కడ కంచె నిర్మాణం కోసం బీఎస్ఎస్ దళాలకు భూమిని బదలాయిస్తూ తొలి క్యాబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం 45 రోజుల్లో అమల్లోకి వస్తుందని పేర్కొంది.

బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె ఏర్పాటు కోసం పశ్చిమ బెంగాల్ నూతన ప్రభుత్వం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ సోమవారం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా, దీనిపై పొరుగు దేశం స్పందించింది. తాము ముళ్ల కంచెలకు భయపడబోమని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం హెచ్ కబీర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రయోజనాలను కాపాడటం కోసం తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, అవసరమైతే భారత్‌తో చర్చలు కూడా జరుపుతామని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు, బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను తాము గమనిస్తున్నామని చెప్పారు. అయితే, భారత్ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలనే ఉద్దేశం తమకు లేదని ఉద్ఘాటించారు. తమ సంబంధాలు కేవలం కేంద్ర ప్రభుత్వంతోనే ఉంటాయని వ్యాఖ్యానించారు. సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఇరు దేశాల్లోని నాయకత్వాలు కట్టుబడి ఉన్నాయని అన్నారు. ప్రాంతీయ శాంతి, సంభాషణల ప్రాముఖ్యతను కబీర్ నొక్కిచెప్పారు. బంగ్లాదేశ్‌తో ప్రజల మధ్య సంబంధాలను మరింతగా పెంపొందించుకోవాలంటే, సరిహద్దు భద్రత విషయంలో భారత్ మరింత మానవతా దృక్పథాన్ని అవలంబించాలని ఆయన అన్నారు.

తాము అధికారంలోకి వస్తే 45 రోజుల్లో బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం చేపడతామని ఎన్నికల సమయంలో బీజేపీ బలంగా ప్రచారం చేసింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి సువేందు అధికారి అధ్యక్షతన జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకున్నారు. 127 కిలోమీటర్ల పొడవున కంచె నిర్మాణం కోసం భూ కేటాయింపుల ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఈ ప్రక్రియ 45 రోజుల్లో పూర్తవుతుందని ప్రకటించారు. బెంగాల్ ఎన్నికల్లో 'చొరబాట్లు' అంశాన్ని బీజేపీ ప్రచార అస్త్రాల్లో ఒకటిగా నిలిచింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని టీఎంసీ ప్రభుత్వం బంగ్లాదేశ్ చొరబాటుదారులను అడ్డుకోవడం లేదని, వారికి ఆశ్రయం కల్పిస్తోందని ఆరోపించింది. తాము అధికారంలోకి వస్తే అక్రమంగా దేశంలోకి చొరబడినవారిని వెళ్లగొడతామని హామీ ఇచ్చింది. బెంగాల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ.. తొలిసారి అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## నిషేధిత బీటీ3 పత్తి విత్తనాల అక్రమ రవాణా భగ్నం

- **షామీర్‌పేట్‌లో 100 కిలోల విత్తనాల స్వాధీనం.. ఒకరు అరెస్ట్**

**జయభేరి, మేడ్చల్ జిల్లా :**

మేడ్చల్ జిల్లా, శామీర్ పేట... నిషేధిత బీటీ3 (బీజీIII హెచ్‌పీ వెరైటీ) పత్తి విత్తనాల అక్రమ రవాణా, విక్రయ యత్నాన్ని ఎస్‌వోటీ కంటోన్మెంట్ బృందం భగ్నం చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి షామీర్‌పేట్ పోలీసుల సహకారంతో శనివారం సాయంత్రం ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.7 సమీపంలో తనిఖీలు నిర్వహించగా, నిషేధిత విత్తనాలను విక్రయించేందుకు తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా చెబ్రోలు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు (58) వద్ద రెండు సంచుల్లో మొత్తం 100 కిలోల బీటీ3 పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. ఒక్కో సంచిలో 50 కిలోల చొప్పున విత్తనాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. విచారణలో భాగంగా నిందితుడు, తన సహచరుడు దాసరి సూరిబాబుతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వద్ద తక్కువ ధరకే విత్తనాలు కొనుగోలు చేసి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రైతులు, ఎరువుల దుకాణాలకు అధిక ధరలకు విక్రయించాలని యత్నించినట్లు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు.

# సాధికారులైన నర్సులు మన ప్రాణాలను కాపాడతారు

● అంతర్జాతీయ నర్సుల దినోత్సవము

జయభేరి, లింగంపల్లి :




లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలో పద్మా అపార్ట్ మెంట్ లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి క్రొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ R. పుట్టరాజు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, BHEL జనరల్ హాస్పిటల్ అతిథులుగా డాక్టర్ B.C.రామన్న సత్యసాయి సేవాసమితి రంగారెడ్డి జిల్లా కన్వీనర్, E. దేవానంద్ యాదవ్ సోషల్ వర్కర్ విచ్చేసి మాట్లాడుతూ.. "ప్రపంచ ఆరోగ్య సంస్థ వారు మే 12వ తారీఖున ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఒక ప్రత్యేక నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 'మన నర్సులు మన భవిష్యత్తు సాధికారులైన నర్సులు మన ప్రాణాలను కాపాడతారు' అనే నినాదంతో నిర్వహిస్తున్నారు.

మానవులకు సేవ చేయడానికి భగవంతుడు కల్పించిన అవకాశమే వైద్య రంగం. దీనిలో ప్రధానమైంది నర్సింగ్ వృత్తి. రోగులకు వైద్యులు యిచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవకూడా అంతే ముఖ్యం" అని అన్నారు. "ఫ్లోరెన్స్ నైటింగేల్ 1812 మే 12వ తేదీన ఇటలీలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. ఆ రోజులలో వైద్యశాలలు శుచిశుభ్రత లేకుండా అధ్వాన్నస్థితిలో ఉండేవి. నైటింగేల్ తన తల్లిదండ్రుల అభీష్టానికి వ్యతిరేకంగా సేవ చేయడానికై నర్సింగ్ వృత్తిని యెంచుకొని జర్మనీ, ఐర్లాండ్ లలో పనిచేసి అక్కడ వైద్యశాలల పరిస్థితులలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి మెరుగుపరచి తిరిగి లండన్ వచ్చి అక్కడ హాస్పిటళ్ళలో పరిశుభ్రతకు ప్రాధాన్యతతో పాటు రోగులకు పౌష్టికాహారాన్ని అందించే ఏర్పాటు చేసింది. 1854లో క్రీమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో క్షతగాత్రులైన సైనికులకు తోటి నర్సులను కూడగట్టుకుని నిరుపమానమైన సేవలు అందించింది.

ఎంతో గుండె నిబ్బరంతో చిమ్మచీకట్లలో చిరుదీపం వెంట తీసుకుని వెళ్ళి రోగులకు సేవలందించి, వారిలో బ్రతుకుతామనే ఆశలను చిగురింపజేసింది. వారి ముఖాలపై చిరునవ్వులు ఆమె చేతిలోని దీపంలాగా వెలిగాయి. రోగులకు కావలసిన మందులు, పరికరాలు పంపమని ప్రభుత్వానికి అర్జీలు పంపేది. రోగులకు ఆసుపత్రులలో చోటు సరిపోకపోతే అధికారులను ఒప్పించి పాత యిళ్ళను, భవనాలను ఆసుపత్రులుగా మార్చేది. 'త్రాగుడుకు డబ్బులు కర్చు పెట్టకండి. ఆ డబ్బులను మీ యింటికి పంపిస్తే యిల్లు గడుస్తుంది కదా' అని హితబోధ చేసేది. గ్రంథాలయాలు, చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది.

నోట్స్ ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్ అనే గ్రంథాలను వ్రాయడమే కాక, విక్టోరియా రాణికి అలాగే ప్రభుత్వ అధికారులకు హాస్పిటల్స్ బాగు కొరకు అభ్యర్థనలు పంపేది. నాటి నుండి నర్సింగ్ వృత్తికి ప్రత్యేకంగా శిక్షణ యివ్వడం ప్రారంభం అయింది. 1860వ సంవత్సరం జూన్ 24 న ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సెస్ అనే సంస్థను లండనులో స్థాపించింది. ఆమెను 'మదర్ ఆఫ్ మోడ్రన్ నర్సింగ్' గా గుర్తించారు. ఆవిడ భారతదేశానికి కూడా యితోధిక సేవలు అందించారు. 1859వ సంవత్సరంలో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు ఒక కమీషన్ ను నియమించింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ సూచనలు, సలహాల మేరకు భారతదేశంలో శానిటరీ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దాని వల్ల మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గడం జరిగింది. ఫ్లోరెన్స్ నైటింగేల్ మరలా పుట్టి నేటి ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితులను మెరుగు పరచాలని కోరుకుందాం. సేవానిరతి గల ప్రతి నర్సులోనూ ఆమె జీవించి ఉంటుంది.

నర్సులు, రోగులు గుర్తుంచుకోవలసిన ఆదర్శమూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ " అని కొనియాడారు. " NURSE అనే ఆంగ్ల పదంలోని అక్షరాలకు (N) NOBLE, (U) UNDERSTANDING, (R) RESPONSIBILITY, (S) SYMPATHY (E) EFFICIENT అనే ఆంగ్ల పదాలను తెలుగులోకి అనువదిస్తే మహోన్నతమైన, అవగాహన, బాధ్యత, సానుభూతి, సమర్థవంతమైన సేవలు అందించేదే నర్సింగ్ వృత్తి" అని అన్నారు. "నైటింగేల్ నర్సింగ్ వృత్తికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆవిడ జన్మదినమైన మే 12వ తారీఖునాడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం" అని అన్నారు. "నేటి యువ నర్సులు ఆవిడ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలి" అని కోరారు. "కనిపించే దేవుళ్ళు వైద్యులైతే కాపాడే దేవతలే నర్సులు" అని కొనియాడారు. తదనంతరం నర్సులచేత ' రోగులకు అంకితభావంతో మెరుగైన సేవలు అందిస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా మానవసేవే మాధవసేవగా భావించి వివిధ ప్రభుత్వ వైద్యశాలలో (నిమ్స్, లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రంగారెడ్డి జిల్లా ఆసుపత్రి, కొండాపూర్, ఏరియా హాస్పిటల్, పటాన్ చెరు, ESI హాస్పిటల్, RC పురం, BHEL జనరల్ హాస్పిటల్, హఫీజ్ పేట అర్బన్ హెల్త్ సెంటర్, HCU హెల్త్ సెంటర్, ఉర్దూ యూనివర్సిటీ హెల్త్ సెంటర్, సరోజినీ దేవి కంటి ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్) రోగులపట్ల ప్రేమానురాగాలు చూపిస్తూ వైద్య సేవలందించిన సేవామూర్తులైన 80 మంది నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుతో పాటు శాలువ, జ్ఞాపిక, పగిడిలతో సత్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమం E. దేవానంద్ యాదవ్ సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందూరి వెంకటేశ్వర రాజు, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, G.V. రావు, సత్యనారాయణ, వాణిసాంబ శివరావు, విజయలక్ష్మీ, విష్ణుప్రసాద్, బాలాజీ, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, పాండు, తదితరులు పాల్గొన్నారు.



## పశువుల రవాణాదారులపై, పోలీసులపై దాడి

● తొమ్మిది మంది అరెస్టు

జయభేరి, సరూర్‌నగర్:

పశువుల రవాణాదారులపై, పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడిన ఘటనలో తొమ్మిది మంది నిందితులను సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. సోమవారం అర్థరాత్రి సుమారు 01:45 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. పురానీ హవేలీలో సినిమా షూటింగ్ కోసం ఎనిమిది ఎడ్లను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని కొత్తపేట ఎక్స్ రోడ్డు వద్ద కొందరు వ్యక్తులు అడ్డుకున్నారు. పశువులను వధశాలకు తరలిస్తున్నారనే అనుమానంతో వాహనదారులను దూషించి, దాడికి దిగారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులపై కూడా సదరు గుంపు దాడి చేసింది. అనంతరం పశువులను భద్రత నిమిత్తం ఫతుల్లాగూడ గోశాలకు తరలిస్తుండగా, చైతన్యపురి యూటర్న్ వద్ద నిందితులు ద్విచక్ర వాహనాలపై వెంబడించి వాహనాన్ని ఆపారు. నిందితులు రాళ్లతో దాడి చేయడంతో ఇన్‌స్పెక్టర్‌తో సహా పలువురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు మరియు వాహనం ధ్వంసమైంది. సరూర్‌నగర్ పోలీసులు ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 497/2026 కింద భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 196 (1), 126 (2), 118 (1), 351 (2), 324 (5), 121 (2), 191 (3) మరియు 190 ప్రకారం కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

పోలీస్ కమిషనర్ హెచ్చరిక: మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మే 7 నుండి 24 గంటల పాటు ఏడు పోలీస్ చెక్ పోస్టులు పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. పశువుల రవాణాపై ఏవైనా అనుమానాలు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోకూడదని కమిషనర్ హెచ్చరించారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

● నిర్మించిన కొన్నేళ్లకే మూతపడ్డ వైనం

జేసీబీలు అడ్డుగా ఉండడంతో కనిపించని టాయిలెట్స్

నిర్వహణా భారంతో మూసివేశామన్న నిర్వాహకులు

ఇదీ యాదగిరిగుట్ట పెద్ద మోరీ దగ్గర ఉన్న టాయిలెట్స్ పరిస్థితి

జయభేరి, యాదగిరిగుట్ట, మే12 :





యాదగిరిగుట్ట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పెద్ద మోరీ దగ్గర నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిరుపయోగంగా మారింది. యాదగిరిగుట్ట పట్టణ ప్రజలు, భక్తులు, యాత్రికుల సౌకర్యార్థం 2024సంవత్సరంలోని పెద్ద మోరీ పక్కన పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించారు. కానీ పబ్లిక్ టాయిలెట్స్‌కు ఎదురుగా జేసీబీలు అడ్డుగా పెడుతుండడంతో ఎవరికీ కనిపించడం లేదు. పబ్లిక్ టాయిలెట్స్‌కు పూర్తిగా జేసీబీ అడ్డుపెడుతుండడంతో నిరుపయోగంగా మారి ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన టాయిలెట్స్ మూతపడ్డాయి.

జేసీబీలు అక్కడి నుంచి తొలగించాలని కోరినా పట్టించుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, పబ్లిక్ టాయిలెట్స్ సరిగా నడవకపోవడంతో నిర్వహణా భారంగా మారి వాటిని మూసివేశామని నిర్వాహకులు తెలిపారు. గతంలోనూ పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరిచి ప్రజలకు ఉపయోగపడే పబ్లిక్ టాయిలెట్స్‌ను తెరవాలని, జేసీబీలను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

జయభేరి, తుర్కపల్లి, మే 12 :




ఒంటరి మహిళలు తమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని నాబార్డ్ డీడీఎం ఝాన్సీ అన్నారు. మంగళవారం స్వర భారతి రైతు నేస్తం ఒంటరి మహిళ సమైక్య రైతు ఉత్పత్తి దారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తుర్కపల్లి మండల కేంద్రంలో జనరల్ బాడీ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి హార్దిక సాధికారత దిశగా ముందడుగు వేయాలని అన్నారు. సంఘాల ద్వారా కొత్త ఆలోచనలు ప్రాజెక్టులు ప్రతిపాదిస్తే నాబార్డ్ వాటిని సాలుకూలంగా స్పందించి సహకారం అందిస్తుందని అన్నారు. మురళి రాజ్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మల్లాల్చిన అవసరం ఉందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గి నేల ఆరోగ్యం మెరుగు పడుతుందని దీర్ఘకాలంలో రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని అన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు పిలుపు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ సంఘాలు బలోపేతం కావాలంటే సభ్యులు ఆర్థికంగా విద్యాపరంగా ఎదగాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వయంపాలన దిశగా సంఘాలు పనిచేస్తే మహిళలు రైతులు సమగ్ర అభివృద్ధి సాధించగలరని అన్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు బలపడడం ద్వారా గ్రామీణ సమాజంలో సామాజిక ఆర్థిక మార్పులు తీసుకురావచ్చు అని అన్నారు. రైతు స్వరాజ వేదిక నాయకులు, కొండల్ రెడ్డి మాట్లాడుతూ రైతులతోపాటు రైతు కూలీలు కౌలు రైతుల సమస్యలపై కూడా సంఘాలు దృష్టి పెట్టాలని అన్నారు కవులు రైతులకు గుర్తింపు సామాజిక భద్రత పెన్షన్ సదుపాయాలు కుటుంబ ప్రయోజన పథకాలు అందేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజా సంఘాలు ఈ అంశంపై చర్చించి చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిలుపు సంస్థ సిబ్బంది ,మహిళలు పాల్గొన్నారు.




## డబుల్ బెడ్ రూం ఎంపికలో స్థానికులకు కేటాయించాలి

జయభేరి, కాప్రా :

హిమాయత్ లోని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (TGHCL) కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో డబుల్ బెడ్‌రూమ్ గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్దిదారుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. కాప్రాలో గల డబుల్ బెడ్ రూమ్ లాల్లో లిఫ్ట్ లు పనిచేయడం లేదు అని అలాగే గ్రామ పంచాయతీ లే అవుట్ లు చేసి అమ్ముకుంటున్నారు అని రైతు బంధు కూడా తీసుకుంటున్నారు అని అలాగే డబుల్ బెడ్ రూం ఎంపికలో 50 స్థానికులకు కేటాయించాలి అని ఆయన అన్నారు. అలాగే డబుల్ బెడ్ రూం ల్లో సమస్యలు పరిష్కరించాలి అని ఆయన కోరడం జరిగింది. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల కి స్థలం కేటాయించాలని కోరారు. వెంటనే మంత్రి కలెక్టర్ కి తెలియజేయడం జరిగింది. గృహ నిర్మాణాల పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు త్వరితగతిన ఇళ్లను అందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



జయభేరి, కాప్రా :

ఐజీ కాలనీ, చెర్లపల్లి వాసుల సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముందు అడుగు వేస్తున్నారు. 2009 సంవత్సరంలో జేఎన్యూఆర్ఎం (JNNURM) పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. దీంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని తెలిపారు. అలాగే, 2009లో నిర్మించిన ఇళ్లలో చాలావాటిలో స్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం నెలకొన్నదని, వాటి మరమ్మతుల కోసం కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పరిస్థితిని వెంటనే పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు నెమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు పర్షురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్, వెంకటేష్, ప్లహా రాధ్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం




జయభేరి, యాదగిరిగుట్ట, మే 12 :

యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. మంగళవారం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ ధాన్యం బస్తాలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కర్రె వెంకటయ్య మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేదని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేయడమే కాకుండా కక్షపూరిత నిర్ణయాలతో వారిని ఆందోళనకు గురి చేస్తోందని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు ఫోటోలకు మాత్రమే పరిమితమవుతూ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, గ్రామ శాఖ అధ్యక్షుడు గౌడ శ్రీశైలం, రైతులు కర్రె చంద్రశేఖర్,ఒగ్గు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## టాపర్ విద్యార్థికి ఆర్థిక సహాయం

● ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



జయభేరి, యాదగిరిగుట్ట, మే 12:

యాదగిరిగుట్ట మున్సిపల్ కేంద్రంలోని గౌతమ్ హైస్కూల్ చెందిన నిరుపేద విద్యార్థి కొంపల్లి అరుణ్ కుమార్ ఉన్నత విద్యాభ్యాసానికి బీర్ల ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయమందిస్తామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. ఇటీవల వచ్చిన ఎస్ఎస్సీ ఫలితాల్లో 600 మార్కులకు గానూ 563 మార్కులు సాధించి అరుణ్‌కుమార్ టాపర్‌గా నిలిచాడు. ఇంటర్, పైచదువుల కోసం ఆర్థిక సాయమందించాలని గౌతమ్ హైస్కూల్ కరస్పాండెంట్ మిర్యాల దుర్గాప్రసాద్‌ను విద్యార్థి తల్లి ఝాన్సీ కలిసి కోరగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కలిసి విషయం వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి అండగా ఉంటామని, అరుణ్ కుమార్ ఇంటర్ విద్యాభ్యాసానికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

# మలుపు తిరిగిన మదర్ డెయిరీ చరిత్ర

- తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటీ శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కృషితో..
- ఎన్ఐడిబి మదర్ డెయిరీ మధ్య పరస్పర ఒప్పందం
- ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిన మదర్ డెయిరీ పాడి రైతులు..
- తొలి విడతగా మదర్ డెయిరీకి రూ.10 కోట్ల సాయం




జయభేరి, హైదరాబాద్, మే 12:

వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమ రైతాంగానికి చేదోడు వాదోడుగా ఆర్థిక పరంగా ఆదుకుంటూ ఉంటుంది. పాడి రైతుల నుంచి ప్రతినిత్యం పాలు సేకరించి పాలు,పెరుగు,ఐస్ క్రీమ్, పన్నీరు, నెయ్యి ఇలా పాల ఉత్పత్తులను ప్రజలకు అందించడంలో మార్కెటింగ్ చేయడంలో మదర్ డెయిరీ అగ్రగామిగా సంస్థగా ఉంది. అలాంటి మదర్ డెయిరీ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో తాను ఒక రైతుగా ,పాల ఉత్పత్తి దారునిగా,పాల సంఘం చైర్మన్ గా దశాబ్దాల అనుభవం కలిగిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషితో మదర్ డైర్ కష్టాలు గట్టెక్కుతున్నాయి.

**ఎన్ డి డిబిబి మదర్ డెయిరీ మధ్య కీలక ఒప్పందం**

ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న మదర్ డెయిరీని పరిరక్షించడంలో బీర్ల ఐలయ్య కీలక భూమిక పోషించారు. ఆయన కృషి ఫలితంగా మదర్ డైరీని ఆదుకునేందుకు నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్ (ఎన్ఐడిబి) ముందుకు వచ్చింది. హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ ఉభయ సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్థక మంత్రి వారిటీ శ్రీహరి,ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలాంబర్తి,మదర్ డెయిరీ చైర్మన్ మధు సూదన్ రెడ్డి, డైరెక్టర్లు,అలాగే వీణదీ సంస్థకు చెందిన సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్రీధర్, సౌత్ రీజినల్ హెడ్ ఆర్మీ జాకబ్,డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేష్ కుమార్ పాల్గొని విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం పరస్పర సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉభయ సంస్థల మధ్య పరస్పర ఒప్పందం కుదర్చడంలో మంత్రి, ప్రభుత్వ విప్ ముఖ్య పాత్ర పోషించారు. వారి సమన్వయంతో పాడి రైతులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, పాల ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరినట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

**మదర్ డెయిరీకి రూ.10 కోట్ల చెక్కు**

ఈ సందర్భంగా నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు అధికారులు మదర్ డెయిరీ అభివృద్ధి కోసం తొలి విడతగా రూ.10 కోట్ల చెక్కును తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటీ శ్రీహరి,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా మదర్ డెయిరీ ప్రతినిధులకు అందజేశారు.

ఈ నిధులతో పాల సేకరణ కేంద్రాల విస్తరణ,శీతలీకరణ కేంద్రాల అధునీకరణ, రైతులకు సాంకేతిక సౌకర్యాల కల్పన,పాడి పరిశ్రమ విస్తరణ, అలాగే పెండింగ్ లో ఉన్న రైతుల బిల్లుల చెల్లింపులు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ ఒప్పందం ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అధికారులు అశాభావం వ్యక్తం చేశారు.

**బీర్ల అయిలయ్య హర్షం**

ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పాడి పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. పాడీ రైతులు ఆర్థికంగా బలపడాలంటే పాల ఉత్పత్తి రంగాన్ని ఆధునికీకరించడం అత్యంత అవసరం.

ఎన్ డిబిడి మదర్ డెయిరీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. రైతులకు సమయానికి బిల్లులు చెల్లించడం,పాల సేకరణను పెంచడం,ఆధునిక సదుపాయాలు కల్పించడం ద్వారా పాడి రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి యువతకు కూడా ప్రయోజనం చేకూరుతుంది అని హర్షం వ్యక్తం చేశారు.



## యాదాద్రిలో ఘనంగా హనుమజ్జయంత్యోత్సవాలు

జయభేరి, యాదగిరిగుట్ట, మే 12 :

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామి జయంత్యోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జయంత్యోత్సవాలను పురస్కరించుకొని కొండపైన ఆలయంలో పుష్కరిణి ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అభిషేకం, ప్రత్యేక అలంకారం, హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పారాయణం, వేదపఠనం, లక్ష తమలపాకు అర్చన, మహామంగళహారతి పూజా కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. పూజలలో యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, ఆలయ అర్చకులు,అధికారులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మంగళవారం శ్రీ ఆంజనేయ స్వామికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ పై పురోహితుల అక్షింతలు తల్లి ఆశీర్వచనం పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు మంగళవారం రైతులు 125 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి అత్యధికంగా క్వింటాల్ కు రూ.2411 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.2100 ధర పలికింది. అలాగే 44 క్వింటాళ్ల హంస ధాన్యాన్ని రైతుల విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ.1801 ధర పలికింది. అలాగే అతి తక్కువగా 1701 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## పెళ్లికూతురుకు పుస్తేమెట్టేలు అందజేసిన మందడి సరోజ్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ లో మంగళవారం చుక్కల సత్తయ్య కుమార్తె ప్రధానం కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది ,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పెళ్లి కూతురుకు ఆయన పుస్తెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, సరోజ్ రెడ్డి యువసేన తదితరులు పాల్గొన్నారు.

## వేములపల్లి పంతులు తండాలో వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ట

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్




జయభేరి, దంతాలపల్లి, మే 12 :

:మండలంలోని వేములపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పంతులు తండాలో నూతన కనకదుర్గమ్మ ఆలయాన్ని ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ మంగళవారం ప్రారంభించి,వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్,మండల పార్టీ అధ్యక్షుడు గగులోత్ బట్టు నాయక్, పిఎసిఎస్ చైర్మన్ రాము గౌడ్, సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు అక్కిరెడ్డి దామోదర్ రెడ్డి, వేములపల్లి గ్రామ సర్పంచ్ గుమ్మడవెల్లి రవి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపేట సురేష్ గౌడ్, కసిరెడ్డి నవీన్ రెడ్డి, లింగారెడ్డి,రాంరెడ్డి,దుండి వెంకటేశ్వర్లు, నెమ్మది యాకయ్య,ఆవుల సురేష్,జెట్టి ఆజాద్ చంద్రశేఖర్,పడిదం లింగన్న,మల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



జయభేరి, తుర్కపల్లి, మే 12 :

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు రానున్న వానకాలం సాగుకు సంబంధించిన వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కే మధుబాబు మాట్లాడుతూ రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడకూడదని సేంద్రీయ ఎరువులను తప్పకుండా వాడడం అలవర్చుకోవాలని అన్నారు. విత్తనాలు ఎరువులు పురుగుల మందుల రసీదులను భద్రపరుచుకోవాలని అన్నారు. సాగు నీటిని వృధా చేయకుండా చూడాలని, వరిలో రైతులు వరి విత్తనాన్ని వారే తయారు చేసుకోవచ్చని తెలిపారు. చెట్లు భూగర్భ జలాల నిలువ నీటి వనరులను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ,కాబట్టి చెట్లను నాటాలని వివరించారు .వరిలో గట్ల నిండా నీరు పెట్టి సాగు చేయడం వలన దిగుబడులు తక్కువ అవుతాయని అనవసర నీటి వినియోగం వృధా ఖర్చు నష్టం అని వివరించారు .పురుగుమందులను విచక్షణతో వాడి ఆరోగ్యంలో పురుగుమందు అవశేషాలు లేకుండా చూడాలన్నారు. అనవసర రసాయన ఎరువులు వాడడం తగ్గించి భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి భారతి, ప్రధాన శాస్త్రవేత్త రాకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుమలరావు, ఉపసర్పంచ్ బాలరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల ఎల్లేష్ యాదవ్, కనకయ్య, గణేష్, నరసింహులు, బిక్షపతి, వెంకటేశం, ముత్యాలు, నరసింహులు, కనకయ్య, పద్మ, లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.



## సర్పంచుల సదస్సును విజయవంతం చేయాలి

- దంతాలపల్లి ఎంఈఓ శ్రీదేవి

జయభేరి, దంతాలపల్లి, మే 12 :

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విద్యావారోత్సవాలులో భాగంగా మే 13న జిల్లా పరిషత్ పాఠశాల దంతాలపల్లిలో ఉదయం గం.9.00 నుండి దంతాలపల్లి మండలంలోని సర్పంచ్ లు అందరికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీదేవి తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు అందచేస్తున్న ప్రోత్సాహకాలు, పాఠశాల ల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, మండల విద్యాశాఖ ప్రగతి గురించి ఒకరోజు అవగాహనా సదస్సుఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ లు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె తెలియజేశారు.

# బండి భగీరథ పై పోక్సో కేసు నమోదైన ప్రభుత్వ

- ఇంకా ఎందుకు చర్యలు తీసుకోలేక పోతుంది
- మంత్రి కొడుకులకు ఒక న్యాయం మధ్య తరగతి వారికి ఒక న్యాయమా..
- అమ్మాయిలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం
- తప్పు చేయకపోతే పరరిలో ఉండటం ఎందుకు?
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్




జయభేరి, షాద్ నగర్, మే 12 :

మైనర్ బాలికకు జరిగినటువంటి అన్యాయాన్ని చట్టపరంగ బండి భగీరథ పైన కఠిన చర్యలు తీసుకోవాలి.బాధ్యతగల పదవిలో ఉన్న బండి సంజయ్ కొడుకు మైనర్ బాలికపై మద్యం తాగించి అత్యాచారం చేయడం చాలా దారుణం. ప్రియాంక రెడ్డికి జరిగిన న్యాయం మైనర్ బాలిక విషయంలో ఎందుకు జరగడం లేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి అని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ...వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉండాలి ఒకపక్క దిశా లాంటి చట్టాలు వస్తున్న మరో పక్క ప్రియాంక రెడ్డిని హతమార్చిన వారికి శిక్షించిన మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. భారతదేశంలో భారతమ్మకు అన్యాయం జరిగితే కనీసం న్యాయం చేయలేకపోతున్నారు బిజెపి నాయకులు అలాంటిది రాష్ట్రంలో దేశంలోనే ఉన్న మహిళలకు ఏ విధంగా భరోసా ఇస్తారు అని చెప్పి అడుగుతా ఉన్నాం భేటీ పడావో బేటి బచావో అని అంటూనే మరోపక్క కేంద్ర మంత్రి తనయుడు మైనర్ బాలిక పట్ల ప్రవర్తించిన తీరు దుర్మార్గమైన చర్య అని అన్నారు. కాబట్టి ఖచ్చితంగా బిజెపి ప్రభుత్వం బండి సంజయ్ మంత్రి పదవి నుంచి తప్పించాలి అలాగే రాజ్యాంగబద్ధంగా బండి భగీరథ పైన చర్యలు తీసుకోవాలని చెప్పి కోరుతున్నాం. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## 23న దేవరకద్రలో హిందూ సమ్మేళనం

- శ్రీనివాస గార్డెన్ లో సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరవుతున్న శ్రీ శ్రీ శ్రీ శంకర్ స్వామీజీ





జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 23న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఆరోజు సాయంత్రం 6 గంటలకు ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ శ్రీ మానికేశ మహాసంస్థానం దామర్ చేడ్, తెలంగాణ సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత మార్గదర్శకుడు శ్రీ శ్రీ శ్రీ శంకర స్వామి హాజరవుతున్నారు. అలాగే వక్త సంస్కార భారతి ప్రాంత సంఘటన మంత్రి శ్రీ జమాల్ పూర్ నిరంజన్, మహిళా వక్త హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త శ్రీమతి మౌనిక సుంకర హాజరవుతున్నారు. ఈ సందర్భంగా సమ్మేళనంలో వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కావున ఈ కార్యక్రమానికి ఆత్మీయ హైందవ సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని హిందూ సమ్మేళన ఉత్సవ సమితి అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కల్వ నరేష్ కుమార్, కోశాధికారి భాస్కర్ కోరారు.

## నేడు కొలువుదీరనున్న కురుమూర్తి దేవస్థానం పాలకమండలి

- మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పాల్గొననున్న ఎమ్మెల్యే జిఎంఆర్





జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇంతక్రితం ఉన్న పాలకమండలి సభ్యుల పదవీకాలం పూర్తి కావడంతో నూతన పాలక మండలి ఖరారైంది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక మరియు యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరవుతున్నారు. ఉదయం 11:30 గంటలకు దేవస్థానం వద్ద నూతన పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# నీట్ రద్దు... త్వరలో పరీక్ష నిర్వహిస్తామన్న ఎన్టీఏ

- రాజస్థాన్‌లో పేపర్ లీక్ వార్తల దుమారం
- లీకేజీ ఆరోపణలతో విచారణ కోసం కేసు సీబీఐకి అప్పగింత
- డెహ్రాడూన్ నుంచి లీకై వాట్సాప్‌లో ఫార్వార్డ్ అయిన పేపర్

జయభేరి, న్యూఢిల్లీ, మే 12




జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ పరీక్ష( నీట్‌యూజీ) 2026కు సంబంధించిన ప్రశ్నాపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు దుమారం రేపుతున్నాయి. ఈ ప్రశ్నాపత్రం పలుమార్లు వాట్సాప్‌లో ఫార్వార్డ్ కావడంతో వెలుగులోకి వచ్చింది. ఈ ప్రశ్నాపత్రం ఒకచోట లీక్ అయినప్పటికీ, పలువురికి ఇది చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో మే 3వ తేదీన జరిగిన నీట్ (యూజీ) పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వెల్లడించింది. త్వరలో కొత్త తేదీలను ప్రకటిస్తామని తెలిపింది. ఇటీవలే జరిగిన ఈ పరీక్షకు 22 లక్షలమంది విద్యార్థులు హాజరయ్యారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో, దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఐ విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని, విచారణ సంస్థకు కావాల్సిన అన్ని వివరాలను అందజేస్తామని ఎన్టీఏ తెలిపింది. ఇప్పటికి ఈ ఆరోపణలపై రాజస్థాన్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ) దర్యాప్తు జరుపుతోంది.

**లీకైన పేపర్.. ఒకరి నుంచి ఒకరికి ఇలా...!**

డెహ్రాడూన్‌లో ఉంటున్న సికార్ వాసి రాకేశ్ మందవారియా నుంచి ఈ పేపర్ బయటకు వచ్చింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, అక్కడి నుంచి కేరళలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థికి చేరింది. ఈ ఎంబీబీఎస్ విద్యార్థి రాజస్థాన్‌లోని చురు ప్రాంతానికి చెందినవాడు. కేరళలో చదువుతున్న ఈ రాజస్థాన్ విద్యార్థి దీనిని సికార్ ప్రాంతానికి చెందిన తన స్నేహితులతో మే 1వ తేదీన పంచుకున్నాడు. నీట్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో లీకైనట్లుగా భావిస్తున్న ప్రశ్నలు పోలి ఉండటం అనుమానాలకు తావిస్తోంది.అక్కడి నుంచి ఇది ఒక పేయింగ్ గెస్ట్ వసతి గృహం యజమాని వద్దకు చేరింది. అతడు కూడా దానిని మరికొందరు విద్యార్థులతో పంచుకున్నాడు. వీరంతా ఇతర విద్యార్థులు, కెరీర్ కౌన్సిలర్లతో పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పేపర్ అలా ఒకరి వద్ద నుంచి మరొకరి వద్దకు వాట్సాప్ ద్వారా వ్యాపించింది. ఈ పేపర్‌ను కొంతమంది ప్రింట్ తీసుకుని ఉండి ఉంటారని అనుమానిస్తున్నారు. ప్రింట్ తీసుకుని ఉంటే అలాంటి వారిని గుర్తించడం కష్టమే అవుతుంది.ఈ పేపర్ లీకేజీ గురించి పేయింగ్ గెస్ట్ వసతి గృహం యజమాని ఫిర్యాదు చేశాడు. అయితే పేపర్ లీక్ గురించి అందరికీ తెలియడంతో దాని నుంచి తాను తప్పించుకోవడానికి ఫిర్యాదు చేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ పేపర్ లీక్‌కు సంబంధించి పూర్తి ఆధారాలు, అలాగే ఇది ఎక్కడి నుంచి వచ్చిందనే విషయాలు వెల్లడి కావాల్సి ఉందని జైపూర్ పోలీసు అధికారులు చెబుతున్నారు.ఎస్ఓజీ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ విశాల్ బన్సల్ మీడియాతో మాట్లాడుతూ, ఆ పేపర్‌లో 400కు పైగా ప్రశ్నలు ఉన్నాయని, వాటిలో సుమారు 120 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చినట్లు చెప్పారు. లీకైనట్లుగా భావిస్తున్న పేపర్ నీట్ పరీక్షకు కొన్ని వారాల ముందే విద్యార్థుల వద్ద ఉందని అన్నారు.ఈ ప్రశ్నాపత్రం ఎక్కడి నుంచి లీకైందనే విషయం వెల్లడి కాలేదని తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల మొబైల్ ఫోన్‌లలోని వాట్సాప్‌లో కనిపించినట్లు చెప్పారు. ఈ పేపర్ లీకేజీ ఆరోపణలకు సంబంధించి ఇప్పటి వరకు 20 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో విద్యార్థులు, కెరీర్ కౌన్సిలర్లు ఉన్నట్లు తెలిపారు.విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకు మరోసారి పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎన్టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులను విడుదల చేస్తామని తెలిపింది.

**రాహుల్ గాంధీ ఫైర్**

వైద్య విద్య జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్‌యూజీ) 2026కు సంబంధించిన ప్రశ్నాపత్రం లీకైనట్లు వచ్చిన వార్తలపై లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. దాదాపు 22 లక్షలమంది నీట్ పరీక్షను రాశారని గుర్తు చేశారు. ఆ విద్యార్థులు పడిన కష్టాన్ని, వారి కలలను బీజేపీ సారథ్యంలోని అవినీతి వ్యవస్థ ఛిన్నాభిన్నం చేసిందని ఆయన 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు.నీట్ పరీక్ష రద్దయిందని, దీంతో లక్షలాది మంది విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల కోసం కొందరి తండ్రులు రుణాలు తీసుకున్నారని, మరికొందరి తల్లులు బంగారం అమ్మేశారని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో నిద్రలేని రాత్రులు కష్టపడి చదివితే, వారికి దక్కిన ప్రతిఫలం 'పేపర్ లీకేజీపరీక్ష రద్దు' అని ధ్వజమెత్తారు.ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి పేపర్ లీకేజీకి నిదర్శనమని మండిపడ్డారు. ఇది కేవలం వైఫల్యం కాదని, యువత భవిష్యత్తుపై జరిగిన నేరమని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్ష లేకుండా తప్పించుకుంటోందని అన్నారు. కానీ విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీ కారణంగా విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోందని అన్నారు. ప్రధాని మోదీ చెబుతోన్న అమృత్ కాలం దేశానికి విషమయంగా మారిందని అన్నారు.



## కొత్తకోటలో హనుమాన్ శోభాయాత్ర

- హాజరైన కొండ ప్రశాంత్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రశాంత్ రెడ్డి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మన హిందూ ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష పేపర్ లీక్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



జయభేరి, దేవరకొండ :

నిట్ పరీక్షకు రెండు రోజుల ముందే పేపర్ లిక్ కావడం తో ఎంతో కష్టపడి చదువుకున్న విద్యార్థుల భవిష్యత్తు దారుణంగా మారిందని వారు అన్నారు నీట్ ను రద్దు చేయడం సరికాదని,వెంటనే సమగ్ర విచారణ జరిపి కారకులైన అధికారులను, నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## CC ఫుటేజ్ ఆధారంగా దొంగ సంచరించినట్లు అనుమానం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండలో సోమవారం రాత్రి దొంగ సంచరించినట్లు స్థానికులు పేర్కొన్నారు. స్థానిక అయ్యప్పనగర్ కాలనీలో అర్ధరాత్రి కుక్కలు బాగా మొరగడంతో స్థానికులు మేల్కొని గమనించగా దొంగ సంచరిస్తున్నట్లు అనుమానంతో స్థానికంగా ఉన్న యువకులు నల్లగాసు నవీన్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనుమానితుడు అయ్యప్పనగర్ నుండి హనుమాన్ నగర్ లోకి ప్రవేశించినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు తీసుకోవడంతో దొంగ పరారయ్యాడు.

# షాద్‌నగర్‌లో దారుణ హత్య

- కేసులు చేదించిన షాద్ నగర్ పోలీసులు
- డబ్బుల కోసం కూలీ కార్మికుడిని హత్య చేసిన ఇద్దరు నిందితులు అరెస్ట్
- టెక్నికల్ ఆధారాలతో 48 గంటల్లో కేసు ఛేదించి ప్రెస్ మీట్ లో వెల్లడించిన షాద్‌నగర్ పోలీసులు

జయభేరి, షాద్ నగర్, మే 12 :




ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. డబ్బుల కోసం కూలీ కార్మికుడిని హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం పోమాల్ గ్రామానికి చెందిన పల్లె కేశవులు (39) షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లోని శ్రీనివాసరావు ఫామ్ హౌస్‌లో కూలీగా పని చేస్తూ కుటుంబంతో నివసిస్తున్నాడు. భూమి వివాదం విషయంలో మాట్లాడేందుకు మే 9న తన యజమాని వద్ద నుంచి రూ.50 వేల అప్పుగా తీసుకుని పరిగికి వెళ్లాడు. అక్కడ తన అన్నదమ్ములతో కలిసి భూమి సమస్యపై చర్చించి, తిరిగి షాద్‌నగర్‌కు చేరుకున్నాడు. ఆ రాత్రి షాద్‌నగర్ బస్టాండ్ సమీపంలోని వైన్ షాప్ వద్ద మద్యం సేవిస్తున్న సమయంలో పుల్లగోయి బజరన్నతో పరిచయం ఏర్పడింది. ఈ సమయంలో కేశవుల వద్ద నగదు ఉన్న విషయం గమనించిన బజరన్న డబ్బులు దోచుకోవాలని యోచించాడు. అనంతరం బైన్ల యాదమ్మ సహకారంతో కేశవులను వీర్లపల్లి రోడ్డులోని ఎస్ ఎస్ ఆర్ వెంచర్ ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేశాడు. ఘటనలో కేశవులు అక్కడికక్కడే మృతి చెందగా, నిందితులు నగదు తీసుకుని పరారయ్యారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టి మే 12న నిందితులు పుల్లగోయి బజరన్న, బైన్ల యాదమ్మలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.3,900 నగదు, హోండా షైన్ బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, షాద్‌నగర్ డీసీపీ సీహెచ్ శిరీష, ఏసీపీ ఎస్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సీతారాం నేతృత్వంలో ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించింది. కేసు ఛేదనలో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# బీర్ల ఐలయ్యను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు

జయభేరి, తుర్కపల్లి, మే 12 :



ప్రభుత్వ విప్ బీర్ల ఐరయ్యను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల ఎల్లేష్ యాదవ్ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ రైతుల ఆపద్బాంధవుడు బీర్ల ఐలయ్యను బీఆర్ఎస్ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజా పాలన రైతుల కోసం అహర్నిశలు కష్టపడుతూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న బడుగు బలహీన వర్గాల ముద్దుబిడ్డను విమర్శించే స్థాయి లేదని అన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను శాశ్వత పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల నుండి రైతుల నుండి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఆసక్తి ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు ప్రజల నుంచి వచ్చే సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటిని రెండు వెంటనే పరిష్కారం చూపే చొరవ ఆయనకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని అన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సంకల్పంతో భవిష్యత్తు తరాల మేలు జరిగేలా ఆయన ప్రణాళికలు రూపొందించాలని దూర దృష్టితో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి బాలరాజు, గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు సాగ బాలరాజు, నాయకులు సాగర్ల బిక్షపతి, బొత్త ముత్తయ్య పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబ అమ్మాయి పెళ్ళికి అర్థిక సహాయం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలో 14 వ వార్డు కు చెందిన పద్మ కూతురు వివాహనికి BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్ తమ వంతు సహాయంగా కొంత నగదు BRS పార్టీ నాయకులు 14 వార్డు EX అభ్యర్థి బాబా చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం

- బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులకు పోటీ ఇవ్వలేకపోయిన కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు
- గెలుపొందిన సభ్యులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- గెలుపుకు కృషి చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన పాలకవర్గం



జయభేరి, షాద్ నగర్, మే 12 :

షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలోని ఉమ్మడి వీర్లపల్లి గ్రామ పంచాయతీలోని అప్పారెడ్డి గూడ గ్రామంలో ఈరోజు బుధవారం జరిగిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన 9మంది అభ్యర్థులకు గాను 7మంది సభ్యులు గెలిచి ప్రెసిడెంట్ మరియు వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్నికైనారు.నూతనంగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని మొదల్లగూడ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గెలుపొందిన సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలలో విజయం సాధించడంతో సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామీణ ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టంగా తెలుస్తుందని రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించబోతుందని అన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

- లక్ష్మీపురం సర్పంచ్ నల్ల ఆంజనేయులు



జయభేరి, దంతాలపల్లి, మే12 :

మండలం లక్ష్మీపురం గ్రామము ప్రజలు ఉపాధి హామీ పనులు చేస్తుండగా వడ దెబ్బ తగలకుండా ఉండడం కోసం ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేసిన గ్రామ సర్పంచ్ నల్ల ఆంజనేయులు వారి సందర్భంగా మాట్లాడుతూ ఉడదెబ్బకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు సూచించారు ఎండ దెబ్బ వల్ల జ్వరము వాంతులు విరేచనాలు అవుతాయని ప్రమాదాల గురి కాకుండా తలకు సరిగ్గా తల గుడ్డలను కట్టుకోవాలని ఉపాధి హామీ కూలీలకు తెలియజేశారు

## ఘనంగా ప్రపంచ నర్సుల దినోత్సవం



జయభేరి, దేవరకొండ :

మండలం మైనంపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ దేవరకొండ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పనిచేస్తున్న నర్సులకు ఏఎన్ఎం లకు ఆశా కార్యకర్తలకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాసారం అంబేద్కర్.ANM లు విజయ. విద్యావతి. ఆశా కార్యకర్త అలివేలు తదితరులు ఉన్నారు.

## ప్రధాని వ్యాఖ్యలను ఖండించిన ఎంపి చామల

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాజకీయాలు మాట్లాడనంటూనే మోదీ రాజకీయం చేశారని, మన్మోహన్ సింగ్ గుజరాత్‌కు చేసిన సాయం కంటే ఎక్కువే ఇస్తున్నామనడం విడ్డూరమని విమర్శించారు. "నాతో కలిస్తేనే అభివృద్ధి" అన్నట్లుగా మోదీ మాట్లాడటం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తిని మోదీ రాజకీయం చేశారని ఆయన ధ్వజమెత్తారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే

జయభేరి, సిద్దిపేట :

సిద్ధిపేట రూరల్ మండలం బండి చర్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. పంట కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. ముఖ్యమంత్రి, మంత్రులు వెంటనే కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల కష్టాలను తెలుసుకోవాలి. మొక్కజొన్న మక్కలు, సన్‌ఫ్లవర్, శనగలు విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా చెల్లింపులు అందలేదు. మార్కెట్లలో ఇంకా సగం పైగా పంట నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి, రైతులు 40 రోజుల నుండి ఎదురు చూస్తున్నారు. వరి ధాన్యం తరలించడానికి లారీల కొరత తీవ్రంగా ఉంది. ఆర్టిఏ అధికారులు, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులను రంగంలోకి దించి, రోడ్లపై వెళ్లే ఖాళీ వాహనాలను మళ్లించి వెంటనే ధాన్యం తరలించాలి. రైస్ మిల్లులు ధాన్యం దించుకోవడం లేదని, ప్రభుత్వం రైస్ మిల్ అసోసియేషన్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి. ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక సివిల్ సప్లై లేదా రెవెన్యూ అధికారిని నియమించి పర్యవేక్షించాలి. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడం మానేసి, ప్రశ్నించిన వారిపై తిరుగుదాడి చేయడం, కేసులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడుతోంది. వర్షాలు పడి పంట తడవకముందే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలి. గతంలో మేం ఉన్నప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికారులందరితో సమీక్షలు నిర్వహించి సమస్యలు లేకుండా చూశాం. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు మరియు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు వెళ్లిన లోడ్లను దించుకోవడం లేదు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా అస్తవ్యస్త పరిస్థితి నెలకొంది. రైతులు తమ పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్దే నెల రోజులుగా పడిగాపులు కాస్తున్నారు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.

# ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

- రూ.3లక్షల జరిమానా
- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి



ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం (RSASTF) కఠిన చర్యలు అమలు చేస్తోంది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 17/2019 కేసులో ఈ ముద్దాయి తిరుపతి జిల్లా కరకంబాడీ ఫారెస్ట్ బీటు, కృష్ణాపురం సెక్షన్ అటవీ పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లా జమునామత్తూరు తాలూకాకు చెందిన ఏ. పెరుమాళ్ గోపాల్ , కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ కులశేఖర్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

# నమ్మిన వారికే పదవులు

- జ్యోతిష్యునికి కీలక పదవి

జయభేరి, చెన్నై, మే 12 :

తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఓ కీలక నియామకం చేపట్టింది. ముఖ్యమంత్రి విజయ్ తన రాజకీయ వ్యవహారాల కోసం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా తన అత్యంత సన్నిహితుడు, జ్యోతిష్కుడు, పార్టీ అధికార ప్రతినిధి అయిన రిక్కీ రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, వెట్రివేల్ ముఖ్యమంత్రి విజయ్‌కు రాజకీయ సహాయకుడిగా వ్యవహరిస్తారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో రాజకీయ సమన్వయం, సలహా సంబంధిత విధులను ఆయన పర్యవేక్షిస్తారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన టీవీకే ప్రభుత్వం, తమ పాలనా యంత్రాంగాన్ని పటిష్టం చేసుకుంటున్న తరుణంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎంకు ఓఎస్‌డీగా వెట్రివేల్ నియామకం వెనుక ఉన్న కారణాలు, దాని ప్రభావంపై రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది.రిక్కీ రాధన్ పండిట్ వెట్రివేల్ చాలా కాలంగా నటుడు విజయ్‌కు అత్యంత సన్నిహితుడిగా, జ్యోతిష్కుడిగా ప్రసిద్ధి చెందారు. గత కొన్నేళ్లుగా విజయ్ వ్యక్తిగత, రాజకీయ కార్యక్రమాల్లో ఆయన వెన్నంటే ఉన్నారు. టీవీకే పార్టీ ఆవిర్భావం తర్వాత, ఆయన్ను పార్టీ అధికార ప్రతినిధులలో ఒకరిగా నియమించారు. అప్పటి నుంచి టీవీ చర్చల్లో, బహిరంగ వేదికలపై పార్టీ వాణిని బలంగా వినిపిస్తూ వస్తున్నారు. విజయ్‌కు అత్యంత విశ్వసనీయమైన అంతర్గత బృందంలో వెట్రివేల్ ఒకరని, పార్టీ ఏర్పాటు నుంచి కమ్యూనికేషన్, సమన్వయ బాధ్యతల్లో కీలక పాత్ర పోషించారని సమాచారం.ఈ నియామకం ద్వారా ముఖ్యమంత్రి విజయ్ తన పాలనలో నమ్మకమైన వారికే పెద్దపీట వేస్తున్నారనే సంకేతాలు పంపారు. విధేయత, విశ్వాసం ఆధారంగా తీసుకున్న సరైన నిర్ణయమని అధికార పార్టీ మద్దతుదారులు అంటుండగా, ప్రభుత్వ పరిపాలనలో సంప్రదాయేతర రాజకీయ వ్యక్తుల ప్రభావం పెరగడంపై విపక్షాలు, రాజకీయ విశ్లేషకులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మే 10న అధికారం చేపట్టినప్పటి నుంచి విజయ్ ప్రభుత్వం తనదైన పాలన ముద్ర చూపేందుకు వరుస నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ తాజా నియామకంతో ముఖ్యమంత్రి కార్యాలయంలో రాజకీయ సమన్వయ యంత్రాంగం మరింత బలోపేతం కానుంది.




# బేటీ బచావో కాదు... బేటా బచావోగా మారింది బీజేపీ నినాదం

- మైనర్ బాలికపై హత్యాచారం చేసిన సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి.
- బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి – బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల

జయభేరి, మేడిపల్లి :

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల మాట్లాడుతూ... "బేటీ బచావో" అంటూ దేశవ్యాప్తంగా నినాదాలు ఇచ్చే బీజేపీ, ఇప్పుడు "బేటా బచావో" విధానాన్ని అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. మైనర్ బాలికపై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటికీ, నిందితుడు సాయి భగీరథ్‌ను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైందన్నారు. చట్టం అందరికీ సమానమైతే అధికార పార్టీల నేతల కుటుంబాలకు మాత్రం ఎందుకు మినహాయింపు ఇస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ... దేశం కోసం, ధర్మం కోసం అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బండి సంజయ్, ఇప్పుడు తన కుమారుడిని కాపాడేందుకు అధికారాన్ని ఉపయోగిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు. "బేటీ బచావో" నినాదాన్ని "బేటా బచావో"గా మార్చినట్టుగా పరిస్థితి కనిపిస్తోందన్నారు.

బాధితురాలి 164 CrPC స్టేట్మెంట్ ఇప్పటివరకు నమోదు చేయకపోవడం కూడా చట్టపరమైన నిర్లక్ష్యమేనని ఆరోపించారు. రాష్ట్ర డీజీపీ స్థాయి మహిళా అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) ఏర్పాటు చేసి, హైకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్ మాట్లాడుతూ... బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు గంటల తరబడి స్వీకరించకపోవడం, ఫిర్యాదును మార్చమని ఒత్తిడి తేవడం, కేసు వెనుక పెద్దలు ఉన్నారని చెప్పడం వంటి ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. న్యాయం కోసం బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ ముందు వేడుకోవాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి సభలో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన తర్వాతే ఫిర్యాదు స్వీకరించడం దురదృష్టకరమన్నారు. పోక్సో చట్టం ప్రకారం మైనర్ బాలిక సమ్మతి చెల్లదని, అయినప్పటికీ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకుండా బాధితురాలిపైనే కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరించే ప్రయత్నాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ కౌడే పోచయ్య మాట్లాడుతూ... ఈ కేసులో పేట్ బషీరాబాద్ పోలీసుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నిందితుడికి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, వారి కాల్ డేటాను విచారించాలని కోరారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంలోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని నిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ కేసును మీడియా దృష్టికి రాకుండా దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. "హనీ ట్రాప్" పేరుతో అసలు అంశాన్ని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, మహిళల భద్రతపై మాట్లాడే నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయ ప్రయోజనాల కోసం కేసును బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, నాయకులు ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, గడీల జగన్ రెడ్డి, శ్యామల శ్రీనివాస్, పాశం నరేందర్ రెడ్డి, పుల్ల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్, నర్సిరెడ్డి, కళ్యాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# మరో మూడు రోజుల్లో ఏపీలో వర్షాలు

జయభేరి, విజయవాడ,, మే 13 :



ఏపీలో భానుడు భగభగలకు రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. అదే సమయంలో ప్రజలకు చల్లటి వార్త వచ్చింది. ఉత్తర శ్రీలంక తీరము, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం లేక గురువారానికి బలపడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని జిల్లాల్లో మంగళవారం నుంచి మూడు రోజులపాటు వర్షాలు కురవనున్నాయి. మరోవైపు అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, రాబోయే మూడు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీలను దాటేసింది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలైన నంద్యాల, కర్నూలు, అనంతపురంలలో ఎండల ప్రభావం అధికంగా ఉంది. మరోవైపు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో కూడా ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతతో పాటు వడగాలులు కూడా వీచే అవకాశం ఉన్నందున, మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.అయితే, వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల కొన్ని జిల్లాల్లో మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందని అంచనా వేస్తున్నారు.

కోస్తా జిల్లాల్లో 40 నుంచి 50 కి.మీ. వేగంతో గాలులు వీచనున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడితే ఎండల నుండి తాత్కాలిక ఉపశమనం లభించే అవకాశం ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, డీహైడ్రేషన్ బారిన పడకుండా నీరు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఉత్తర శ్రీలంక తీరము, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో బలపడుతోందని APSDMA ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మరోవైపు అల్లూరి జిల్లా జికే వీధి, పెదబయలు,ముంచింగిపుట్టు, పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, మారేడుమిల్లి, గుర్తేడు మండలాల్లో(08) వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. కొన్ని జిల్లాల్లో ఎండ ప్రభావం అధికంగా ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ట్రాన్స్‌జెండర్లకు గుడ్‌న్యూస్..

సమాజంలో దశాబ్దాలుగా వివక్ష, నిరాకరణ, ఉపాధి లేమి మరియు గుర్తింపు సమస్యలతో సతమతమవుతున్న ట్రాన్స్‌జెండర్ వర్గాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొండంత భరోసా ఇచ్చింది. ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ, వారి సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా 'రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు'ను ఏర్పాటు చేస్తూ, దానికి ప్రతినిధులను నియమిస్తూ ప్రభుత్వం అధికారికంగా జీఓ ఎంఎస్ నంబర్ 14ను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్2019', 'రూల్స్2020' మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ బోర్డు పనిచేస్తుంది. ఈ బోర్డులో వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఆంధ్రా ప్రాంత ప్రతినిధిగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్, రాయలసీమ ప్రాంత ప్రతినిధిగా తిరుపతి జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులుగా కోటా ప్రేమ్ సాగర్ రాయ్ (తూర్పుగోదావరి), నక్క జీవన్ కుమారి (గుంటూరు), బోను దుర్గ (ప్రకాశం)లను సభ్యులుగా నియమించారు. వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రెండేళ్ల పాటు లేదా ప్రభుత్వం తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

కుటుంబాల నుంచి వెలివేత, విద్యావకాశాలు కోల్పోవడం, వైద్య సేవల్లో చిన్నచూపు వంటి సమస్యలకు ఈ బోర్డు పరిష్కారం చూపనుంది. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్ల సమస్యలను గుర్తించి నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో వివక్ష లేకుండా చూడటం. వీరికి ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, సామాజిక భద్రత కల్పించడంపై బోర్డు కీలక సూచనలు చేస్తుంది. వారి సంక్షేమానికి తీసుకోవల్సిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వెల్ఫేర్ బోర్డు ముఖ్య ఉద్దేశ్యం.దేశవ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్ వర్గాల హక్కులపై చర్చ పెరుగుతున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. కుటుంబాల నుంచి వెలివేత, చదువు మధ్యలో ఆగిపోవడం, ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, వైద్య సేవల్లో వివక్ష, గుర్తింపు పత్రాల సమస్యలు వంటి అనేక ఇబ్బందులు ఇప్పటికీ ఈ వర్గాలు ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ద్వారా ట్రాన్స్‌జెండర్ వర్గాల సమస్యలను నేరుగా ప్రభుత్వ వ్యవస్థలో చర్చించే అవకాశం ఏర్పడింది. సంక్షేమ పథకాల అమలు, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత వంటి అంశాలపై సమన్వయంతో పనిచేసే అవకాశం ఈ బోర్డుకు ఉండనుంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్2019 ప్రకారం ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై వివక్షను నిషేధించారు. ఉద్యోగం, విద్య, ఆరోగ్యం, నివాసం, ప్రజా సేవల విషయంలో సమాన హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంచారు. అదే చట్టానికి అనుగుణంగా రూపొందించిన రూల్స్2020 ప్రకారం రాష్ట్ర స్థాయిలో వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ఇప్పుడు సభ్యుల నియామక ప్రక్రియ పూర్తి చేసింది. ట్రాన్స్‌జెండర్ వర్గాలను కేవలం సామాజిక కోణంలో కాకుండా హక్కులు కలిగిన పౌరులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ముందుకు వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. ఇటీవల మంత్రి నారా లోకేష్ దృష్టికి ట్రాన్స్‌జెండర్ల సమస్యలను తీసుకెళ్లగా, ప్రభుత్వం తక్షణమే స్పందించి బోర్డును ఏర్పాటు చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. "ట్రాన్స్‌జెండర్లను కేవలం సామాజిక కోణంలోనే కాకుండా, హక్కులు కలిగిన పౌరులుగా ప్రభుత్వం గుర్తించడం గొప్ప పరిణామం. ఇది వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంది," అని ఆమె పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లపై వివక్షను నిషేధిస్తూ, వారిని సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ వెల్ఫేర్ బోర్డు ద్వారా ట్రాన్స్‌జెండర్ వర్గాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఇది వారి ఆత్మగౌరవ పోరాటంలో ఒక కీలక విజయంగా నిలవనుంది.




# యువకుడి హత్య కేసును ఛేదించిన బాలాపూర్ పోలీసులు

- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

జయభేరి, రంగారెడ్డి :

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లో ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఉస్మాన్ నగర్ ప్రాంతంలో అదిత్ పాండే @భజరంగ్ (24) అనే యువకుడిని పాత కక్షల నేపథ్యంలో దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు మృతుడిని మద్యం తాగుదామని నమ్మబలికి పిలిపించి, అనంతరం అతనిపై ఇనుప రాడ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ కేసులో A1 సయ్యద్ ఇఫ్తేఖార్(25),A2 మహమ్మద్ సాహిల్(20),A3 అబ్దుల్లా బిన్ అమీర్(20) లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులకు గతంలో వెహికల్ సీజ్ వ్యవహారంలో పరిచయం ఏర్పడినట్లు, అదే తర్వాత పాత కక్షలకు దారితీసి హత్యకు కారణమైనట్లు పోలీసులు తెలిపారు. సంఘటన అనంతరం ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టిన బాలాపూర్ పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో 12 గంటల్లోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. అదేవిధంగా ముగ్గురు నిందితులపై డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా వారికి పాజిటివ్ రావడంతో NDPS యాక్ట్ కింద కూడా అదనపు కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు.

# వరంగల్లో మందు బాబుల వీరంగం



జయభేరి, వరంగల్ :

ఒక టీ స్టాల్ లో మందుబాబులు వీరంగం సృష్టించారు. మిల్స్ కాలనీ పరిధిలోని గణపతి ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్దకు ఏడుగురు యువకులు మద్యం మత్తులో వచ్చారు. వాటర్ బాటిల్ తీసుకుని కౌంటర్ మీద ఉమ్మడంతో, ఎందుకు ఉమ్మివేశారని టీ స్టాల్ యజమాని నిలదీసారు. దీంతో యజమానిపై, అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై సీసాలతో మందు బాబులు దాడి చేసారు. ఈ ప్రాంతంలో తరచూ పోకిరీల ఆగడాలు ఎక్కువ అవుతున్నా, పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికుల ఆరోపణ.



# 86కే కుప్పకూలిన హైదరాబాద్

భారీ స్కోర్లు కొడుతూ.. పెద్ద టార్గెట్లను అలవోకగా కరిగిస్తూ టాప్ గేర్‌లో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు షాక్. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై గుజరాత్ టైటాన్స్ పేసర్లు కొట్టిన దెబ్బకు ఆరెంజ్ ఆర్మీ నేలకు దిగింది. బ్యాటర్ల మూకుమ్మడి వైఫల్యంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 82 పరుగుల తేడాతో జీటీ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. ఆ జట్టు ఇచ్చిన 169 పరుగుల లక్ష్య ఛేదనలో రైజర్స్ 14.5 ఓవర్లలో 86 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ కమిన్స్ (19) టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కగిసో రబాడ (3/28), జేసన్ హోల్డర్ (3/20) దెబ్బ కొట్టారు. తొలుత సాయి సుదర్శన్ (44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 61), వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో7 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) అర్ధశతకాలతో రాణించగా టైటాన్స్ 20 ఓవర్లకు 168/5 స్కోరు చేసింది. ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ తలోరెండు వికెట్లు పడగొట్టారు. 12 మ్యాచ్‌ల్లో వరుసగా ఐదో, ఓవరాల్‌గా ఎనిమిదో విజయంతో జీటీ టాప్ ప్లేస్‌కు దూసుకెళ్లగా.. అన్నే మ్యాచ్‌ల్లో ఐదో ఓటమితో రైజర్స్ మూడో స్థానానికి పడిపోయింది. కొత్త బంతితో రబాడ, మహ్మద్ సిరాజ్ మిడిల్ ఓవర్లలో హోల్డర్ నిప్పులు చెరగడంతో హైదరాబాద్ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. జట్టుకు వెన్నెముకలాంటి ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (0), అభిషేక్ శర్మ (6) ఘోరంగా నిరాశపరచడంతో రైజర్స్ ఏదశలోనూ ప్రత్యర్థికి పోటీ ఇవ్వలేకపోయింది. స్కోరుబోర్డుపై పరుగు చేరకుండానే సిరాజ్ తొలి ఓవర్లో హెడ్ వికెట్ కోల్పోయిన రైజర్స్‌కు రబాడ చుక్కలు చూపించాడు. పిచ్‌పై పచ్చికను సద్వినియోగం చేసుకుంటూ ఖతర్నాక్ బంతులతో రఫ్ఫాడించడంతో ఎస్ఆర్‌హెచ్ ఆపసోపాలు పడింది. తన వరుస ఓవర్లలోఅభి, ఇషాన్ (11), స్మరణ్ (9)ను ఔట్ చేయడంతో పవర్ ప్లే ముగిసేసరికి 34/4తో హైదరాబాద్ దిక్కుతోచని స్థితిలో నిలిచింది. సూపర్ ఫామ్‌లో ఉన్న క్లాసెన్ (14) కూడా జట్టును ఆదుకోలేకపోయాడు. సలీల్ అరోరా (16)తో కలిసి కాసేపు మాత్రమే ప్రతిఘటించాడు. రబాడ అద్భుత స్పెల్ తర్వాత ప్రసిద్ కృష్ణ, హోల్డర్ జీటీ బౌలింగ్ దాడిని కొనసాగించి రైజర్స్‌ను దెబ్బకొట్టారు. పదో ఓవర్లో కీపర్ క్యాచ్‌తో అరోరాను ప్రసిధ్ పెవిలియన్ చేర్చితే.. ఆ వెంటనే క్లాసెన్‌తో పాటు నితీశ్ రెడ్డి(2) పని పట్టిన హోల్డర్ 13వ ఓవర్లో శివంగ్ కుమార్ (4)ను ఎనిమిదో వికెట్‌గా ఔట్ చేయడంతో హైదరాబాద్ ఓటమి ఖాయమైంది.

క్లిష్టమైన వికెట్‌పై టాపార్డర్‌లో సాయి సుదర్శన్, మిడిల్‌లో ఆల్‌రౌండర్ సుందర్ సత్తా చాటడంతో గుజరాత్ మంచి స్కోరే చేసింది. యువ పేసర్ ప్రఫుల్ హింగే వరుస ఓవర్లలో రెండు కీలక వికెట్లు పడగొట్టడంతో పవర్ ప్లేలో టైటాన్స్ 34 రన్స్ మాత్రమే చేయగలిగింది. సీజన్‌లో నిలకడగా ఆడుతున్న గిల్ (5).. మూడో ఓవర్లో హింగే విసిరిన రెండో బంతిని మిడాన్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆ జట్టు తొలి వికెట్ కోల్పోయింది. అదే ఊపులో హింగే.. ఆరో ఓవర్లో బట్లర్ (7)నూ పెవిలియన్‌కు చేర్చాడు. ఈ దశలో నిశాంత్ (22), వాషింగ్టన్‌తో కలిసి సాయి టైటాన్స్‌ను ఆదుకున్నాడు. సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో నియంత్రించినా సింగిల్స్, డబుల్స్‌తో పాటు వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ రన్‌రేట్ పడిపోకుండా ఆడాడు. జోరుమీద కనిపించిన నిషాంత్‌ను కమిన్స్ ఔట్ చేసినా అతడి స్థానంలో వచ్చిన వాషింగ్టన్.. సాయికి అండగా నిలిచి స్కోరుబోర్డును నడిపించాడు. ఈ క్రమంలో సుదర్శన్ వరుసగా మూడోఅర్ధశతకాన్ని పూర్తిచేశాడు. కానీ ఫిఫ్టీ భాగస్వామ్యం తర్వాత ఈ జోడీని సకిబ్.. సాయిని ఔట్ చేయడం ద్వారా విడదీశాడు. మలింగ వేసిన 19వ ఓవర్లో సుందర్.. 4,4, 6తో బాదగా చివరి ఓవర్లోనూ 10 రన్స్ రావడంతో టైటాన్స్ స్కోరు 160 మార్కు దాటింది. 1 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు ఇదే అత్యల్ప స్కోరు. 2019లో ముంబైతో మ్యాచ్‌లో 96 రన్స్‌కు ఆలౌటైన రికార్డు బ్రేక్ అయింది.

**సంక్షిప్త స్కోర్లు**

గుజరాత్: 20 ఓవర్లకు 168/5 (సుదర్శన్ 61, సుందర్ 50, హింగే 2/17, సకిబ్ 2/37); హైదరాబాద్: 14.5 ఓవర్లలో 86 ఆలౌట్ (కమిన్స్ 19, సలిల్ 16, హోల్డర్ 3/20, రబాడ 3/28)



# తొలి టెస్టులో పాక్ చిత్తు

తొలి టెస్టులో పాక్ చిత్తు స్వదేశంలో పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ సంచలన విజయంతో సత్తాచాటింది. సొంతగడ్డపై టెస్టుల్లో ఇంతవరకూ పాక్‌ను ఓడించని ఆ జట్టు.. మంగళవారం ముగిసిన తొలి టెస్టులో 104 పరుగుల తేడాతో గెలిచి చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. స్వదేశంలో పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ సంచలన విజయంతో సత్తాచాటింది. సొంతగడ్డపై టెస్టుల్లో ఇంతవరకూ పాక్‌ను ఓడించని ఆ జట్టు.. మంగళవారం ముగిసిన తొలి టెస్టులో 104 పరుగుల తేడాతో గెలిచి చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. బంగ్లా నిర్దేశించిన 268 పరుగుల ఛేదనలో పాక్.. 163 రన్స్‌కే ఆలౌటై చిత్తుగా ఓడిపోయింది. నహీద్ రాణా (5/40) ఐదు వికెట్లతో విజృంభించగా తైజుల్ ఇస్లామ్, తస్కిన్ అహ్మద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బోహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.

శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి.ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# ఈ ముద్దుగుమ్మకు అంత క్రేజ్..



మీనాక్షి చౌదరి ప్రయాణం సితార సంస్థతో చాలా స్పెషల్‌గా సాగుతోంది. ఇప్పటికే ఈ బ్యానర్‌లో దుల్కర్ సల్మాన్‌తో 'లక్కీ భాస్కర్', నవీన్ పోలిశెట్టి సరసన 'అనగనగా ఒక రాజు' చిత్రాల్లో నటించింది. ఇక హారిక హాసిని బ్యానర్‌లో మహేష్ బాబు సరసన 'గుంటూరు కారం'లో మెరిసి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. సాధారణంగా ఒక సినిమాలో నటించిన తర్వాత మరో బ్యానర్‌కి వెళ్లడం సహజం. కానీ మీనాక్షి విషయంలో నాగవంశీ టీమ్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఆఫర్ చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, మీనాక్షి చౌదరి సితార సంస్థలో తన ఐదో ప్రాజెక్టును కూడా ఖరారు చేసుకుంది. తమిళ స్టార్ హీరో కార్తీ, దర్శకుడు కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంలో మీనాక్షిని కథానాయికగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సితార సంస్థకు సూపర్ హిట్స్ అందించిన కళ్యాణ్ శంకర్, ఇప్పుడు ఈ వినోదాత్మక చిత్రంతో మరో మేజిక్ చేయబోతున్నారు. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో సైలెంట్‌గా జరిగాయని సమాచారం. కేవలం వెండితెరపైనే కాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా మీనాక్షి దూసుకుపోతోంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా సితార సంస్థ నిర్మిస్తున్న ఒక వెబ్ సిరీస్‌లో కూడా ఆమె నటిస్తోందని టాక్. ఇలా ఒకే ప్రొడక్షన్ హౌస్‌లో ఐదు ప్రాజెక్టులు అంటే, ఆ సంస్థకు ఆమె ఎంత 'లక్కీ' అని భావిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఆమె చేతిలో కార్తీ సినిమాతో పాటు నాగచైతన్య 'వృషకర్మ', హిందీలో 'బాగమ్ భాగ్ 2' వంటి పెద్ద ప్రాజెక్టులు ఉన్నాయి. గ్లామర్‌తో పాటు నటనలోనూ మంచి మార్కులు కొట్టేస్తున్న ఈ హర్యానా బ్యూటీ, రాబోయే రోజుల్లో టాలీవుడ్ టాప్ లీగ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఆమె స్పీడ్ చూస్తుంటే మరిన్ని క్రేజీ ఆఫర్లు రావడం పక్కా అనిపిస్తోంది.



## ప్రేమ, ఆశల కలబోతగా 'రమణి కళ్యాణం'


సహజనటి జయసుధ ముఖ్య అతిథిగా హాజరైన 'రమణి కళ్యాణం' చిత్ర టీజర్ లాంచ్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. సూర్య వశిష్ట, దీక్షిక ప్రధాన పాత్రల్లో విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ ఎమోషనల్ డ్రామాను కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్ పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి, శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేసిన జయసుధ మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని తాను స్వయంగా చూశానని, ఇది ఒక స్వచ్ఛమైన ఫీల్ గుడ్ మూవీ అని ప్రశంసించారు. ఈ మధ్యకాలంలో చిన్న సినిమాల్లో కూడా అద్భుతమైన కథాబలాలు కనిపిస్తున్నాయని, రమణి కళ్యాణం కూడా ఆ కోవకు చెందినదేనని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా హీరో హీరోయిన్ల సహజ నటన, సంగీతం సినిమాకు పెద్ద ఆకర్షణగా నిలుస్తాయని, మే 22న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్లలో చూసి ఆదరించాలని కోరారు. హీరో సూర్య వశిష్ట తన అనుభవాలను పంచుకుంటూ, వీల్ చైర్‌కే పరిమితమై నటించడం ఒక సవాల్‌తో కూడిన అనుభవమని, దర్శకుడు విజయ్ ఈ కథను ఎంతో ప్రాణం పెట్టి తెరకెక్కించారని తెలిపారు. హీరోయిన్ దీక్షిక ఇందులో చూపులేని అమ్మాయి పాత్రలో కనిపించనున్నట్లు చెబుతూ, ఈ కథ విన్నప్పుడు కలిగిన ఎమోషన్ సినిమా చూశాక కూడా అంతే బలంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ ఒక కొత్త ఆశను, పాజిటివ్ ఎనర్జీని ఇచ్చే ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌కు బాగా నచ్చుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. దర్శకత్వం వహించిన విజయ్ ఆదిరెడ్డి మాట్లాడుతూ, తన మిత్రుడు రామ్ జగదీష్ అద్భుతమైన మాటలు అందించారని, ఒక మంచి టీమ్ సపోర్ట్‌తో ప్యాషన్ కలిగిన నటీనటులతో ఈ సినిమాను రూపొందించామని వెల్లడించారు. జయసుధ గారు సినిమా చూసి మెచ్చుకోవడం తమ టీమ్ మొత్తానికి ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. నిర్మాత శ్రీనాథ్ పసుపులేటి కూడా సినిమాలోని సంగీతం, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ రెడ్డి, శ్యామల, చైతు జొన్నలగడ్డ వంటి పేరున్న నటులు నటించిన ఈ చిత్రానికి సూరజ్ ఎస్ కురుప్ సంగీతాన్ని, అరవింద్ తిరుకోవెల ఛాయాగ్రహణాన్ని అందించారు. రామ్ జగదీష్ సంభాషణలు, స్క్రీన్ ప్లే సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 22న గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ప్రభాస్ హీరోయిజం వివేక్ విలనిజం



కేవలం యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ఒక షెడ్యూల్. రెండు నెలలు పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్, వివేక్ ఒబేరాయ్ మధ్య భారీ పోరాటాలు.. ఈ వార్తను బట్టి 'స్పిరిట్'లో యాక్షన్ ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 'స్పిరిట్' షూటింగ్‌కి కొన్ని రోజుల క్రితం విరామాన్ని ప్రకటించిన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా త్వరలో కొత్త షెడ్యూల్‌ని మొదలుపెట్టబోతున్నారు. ఇక ఈ షెడ్యూల్ అంతా యాక్షనే అనే వార్త ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో చర్చనీయాంశమైంది. సందీప్‌రెడ్డి సినిమాల్లో ఎమోషన్స్ ఎంత గొప్పగా ఉంటాయో, ఇంటెన్స్ క్యారెక్టరైజేషన్స్, రా యాక్షన్ ఎలిమెంట్స్ కూడా అదే స్థాయిలో ఉంటాయి. 'స్పిరిట్'కోసం అదే శైలిని మరింత భారీగా ఆవిష్కరించబోతున్నారు సందీప్‌రెడ్డి వంగా. ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. అదీ సందీప్‌రెడ్డి వంగా స్టైల్ పోలీస్ అంటే ఇక చెప్పేదేముంది! థియేటర్లలో జాతరే. ప్రభాస్ హీరోయిజం. వివేక్ ఒబేరాయ్ విలనిజం.. అభిమానులకు గూజ్‌బంప్స్ తెప్పిస్తాయనడంలో సందేహం లేదు.

# అట్టహాసంగా జరిగిన జబర్దస్త్ ప్రవీణ్ పెళ్లి..



బుల్లితెర కామెడీ షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కమెడియన్ ప్రవీణ్ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. జబర్దస్త్, పటాస్ వంటి ప్రముఖ షోలతో ప్రేక్షకులను అలరించిన ప్రవీణ్ తాజాగా తన ప్రియురాలు కడెం వంశితతో వివాహ బంధంలోకి అడుగుపెట్టాడు. గత కొంతకాలంగా నటి, డ్యాన్సర్ అయిన వంశితతో ప్రేమలో ఉన్న ప్రవీణ్ ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. అప్పట్లో వీరిద్దరూ ఎంగేజ్‌మెంట్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా అవి వైరల్ అయ్యాయి. ఇప్పుడు వీరి పెళ్లి కూడా సింపుల్‌గా, కుటుంబ సభ్యులు మరియు అత్యంత సన్నిహితుల సమక్షంలో ఓ ఆలయంలో ఘనంగా జరిగింది.

ఇక తాజాగా ప్రవీణ్ భార్య వంశిత తమ హల్దీ వేడుకలకు సంబంధించిన అందమైన ఫోటోలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంది. పసుపు రంగు దుస్తుల్లో సంప్రదాయ లుక్‌లో మెరిసిపోయిన ఈ జంట ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. హల్దీ వేడుకల్లో కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్‌తో సందడి, ఆనంద క్షణాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు, బుల్లితెర అభిమానులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. "మేడ్ ఫర్ ఈచ్ అదర్", "చాలా క్యూట్ కపుల్", "హ్యాపీ మ్యారెడ్ లైఫ్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వించే ప్రవీణ్ ఇప్పుడు తన రియల్ లైఫ్‌లో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాగా, జబర్దస్త్ ప్రవీణ్ గతంలో ఫైమాతో ప్రేమాయణం నడుపుతున్నాడని త్వరలో వారిద్దరు పెళ్లి పీటలు కూడా ఎక్కనున్నారని వార్తలు వచ్చాయి. కాని ప్రవీణ్ వేరే అమ్మాయిని పెళ్లి చేసుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే రీసెంట్‌గా ఫైమా తన సోషల్ మీడియాలో ప్రవీణ్ పెళ్లి నాడు వీడియో కాల్ చేసి విష్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది.

## పెళ్లి తర్వాత మరింత అందంగా మెహ్రీన్..

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మెహ్రీన్ పీర్జాదా ఇప్పుడు కొత్త జీవితాన్ని ఆస్వాదిస్తోంది. ఇటీవల అర్ష్ ఔలఖ్‌ను వివాహం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ, తాజాగా తన వివాహ వేడుక అనంతరం జరిగిన ప్రత్యేక వేడుకకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ఈ చిత్రాల్లో మెహ్రీన్ కనిపించిన తీరు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. "నక్షత్రాల్లో రాసిన రాత్రి" అంటూ మెహ్రీన్ తన భర్త అర్ష్‌తో కలిసి దిగిన ఫోటోలను పంచుకుంది. సినిమాల విషయానికి వస్తే, నాని హీరోగా నటించిన 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మెహ్రీన్, చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. 'మహానుభావుడు', 'రాజా ది గ్రేట్', 'ఎఫ్ 2' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా "హనీ ఈజ్ బెస్ట్" అనే డైలాగ్‌తో ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఇప్పుడు పెళ్లి తర్వాత కూడా మెహ్రీన్ అదే అందం, హుందాతనంతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆమె తాజా ఫోటోలను చూసిన అభిమానులు "చాలా అందంగా ఉన్నావు", "రియల్ ప్రిన్సెస్‌లా కనిపిస్తున్నావు" అంటూ కామెంట్లు చేస్తున్నారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**